సైకిల్ పురం

మున్సిపల్ చైర్మన్‌గా రమేష్

- టీడీపీకి 23.. వైసీపీకి 14 ఓట్లు
- ఓటింగ్‌కు ఇద్దరు వైసీపీ సభ్యుల డుమ్మా
- ఎమ్మెల్యే బాలయ్యతో కలిసి వచ్చిన కౌన్సిలర్లు
- రాద్ధాంతం చేయాలని వైసీపీ ప్రయత్నాలు
- భారీ బందోబస్తుతో అడ్డుకట్ట వేసిన పోలీసులు



చైర్మన్ ఎన్నికకు చేయి ఎత్తి మద్దతు తెలుపుతున్న ఎమ్మెల్యే బాలకృష్ణ, ఎంపీ పార్థసారథి

హిందూపురం, ఫిబ్రవరి 3(ఆంధ్రజ్యోతి): పురం మున్సిపల్ పీఠం సైకిల్‌పరమైంది. ఆరో వార్డు టీడీపీ కౌన్సిలర్ డీఈ రమేష్ చైర్మన్‌గా ఎన్నికయ్యారు. మున్సిపాలిటీలో 38 వార్డులు ఉండగా, 2021 ఎన్నికల్లో 29 వార్డులను వైసీపీ కైవసం చేసుకుంది. టీడీపీకి ఆరుస్థానాలు దక్కాయి. బీజేపీ, ఎంఐఎం, స్వతంత్ర్య అభ్యర్థి ఒక్కోస్థానంలో గెలిచారు. అప్పట్లో 19వ వార్డు కౌన్సిలర్ ఇంద్రజ చైర్‌పర్సన్‌గా ఎన్నికయ్యారు. కానీ వైసీపీ హయాంలో అభివృద్ధికి ఎలాంటి ఆస్కారం లేకపోవడంతో అసంతృప్తితో ఉండిపోయారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పడ్డాక చైర్ పర్సన్ ఇంద్రజ పార్టీని వీడారు. గత ఏడాది ఆగస్టు 15న టీడీపీలో చేరారు. ఆ మరుసటి రోజే పదవికి, వైసీపీకి రాజీనామా చేశారు. ఆమె వెంట 12 మంది వైసీపీ కౌన్సిలర్లు టీడీపీలోకి వచ్చారు. వీరితోపాటు ఎంఐఎం, స్వతంత్ర కౌన్సిలర్, బీజేపీ కౌన్సిలర్ టీడీపీకి మద్దతుగా నిలిచారు. ఇంద్రజ రాజీనామాతో చైర్మన్ స్థానానికి సోమవారం ఎన్నిక నిర్వహించారు. టీడీపీ అభ్యర్థి రమేష్‌కు 21 మంది కౌన్సిలర్లు, ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ, హిందూపురం ఎంపీ పార్థసారథి ఓటు వేశారు. దీంతో ఆయనకు 23 ఓట్లు దక్కాయి. వైసీపీకి 17 మంది సభ్యులు ఉండగా

(మిగతా 7లో)

గుర్తు తెలియని భయం

యల్లనూరులో గుర్తుతెలియని వ్యక్తుల సంచారం?

- ఇటీవల ఒకేరోజు నాలుగిళ్లలో చోరీ
- ఇది వారి పనేనని అనుమానం
- రాత్రయితే దొంగల కోసం ప్రజల జాగరణ

6



కంకర తేలిన డొనేకల్లు-ఆర్ కొట్టాల రోడ్డు



అంతులేని అక్రమాలు..!


బీటీ రోడ్డు వేయకుండానే నిధులు స్వాహా

- సర్పంచ్ సొంత నిధులతో మట్టి తోలిస్తే.. దానికీ బిల్లులు
- రైతులు చేసుకున్న మరమ్మతులకూ బిల్లులు భోంచేశారు..
- సామాజిక తనిఖీలో బట్టబయలు

విడపనకల్లు, ఫిబ్రవరి 3(ఆంధ్రజ్యోతి): రోడ్డు వేయకుండానే నిధులు కాజేశారు. బోగస్ రికార్డులు సృష్టించి, రూ.32.50 లక్షలు భోంచేశారు. గత వైసీపీ హయాంలో 2022లో ఎన్ఆర్ఈజీఎస్ నిధులతో మండలంలోని ఆర్ కొట్టాల, డొనేకల్లు గ్రామాల మధ్య బీటీ రోడ్డు నిర్మాణం చేపట్టారు. ఆర్ కొట్టాల సమీపంలోని వంక వద్ద నుంచి దాదాపు రెండు కిలోమీటర్ల దూరం వరకూ ఎక్స్‌కవేటర్‌తో రోడ్డును తొలగించారు. అనంతరం కంకరను రోడ్డుకు 1.5 కిలోమీటరు మేర వేశారు. ఆ తర్వాత పనులు ఆపేశారు. దీంతో ఆర్ కొట్టాల, డొనేకల్లు, రైతులు.. రోడ్డు సమస్యను అధికారుల దృష్టికి తీసుకెళ్తానే ఉన్నారు. ఏ అధికారీ స్పందించలేదు. రోడ్డుపై కంకర వేయడంతో ద్విచక్రవాహనదారులు ఎన్నోసార్లు కింద పడి గాయాలు పాలయ్యారు. వరదలతో కొట్టుకుపోవటంతో రోడ్డుకు డొనేకల్లు సర్పంచ్ రూ.5లక్షలతో మట్టిని తోలించారు. దీనికి కూడా అధికారులు రోడ్డుకు మట్టి వేసినట్లు రికార్డులు చేసి, నిధులు స్వాహా చేశారు. రెండుసార్లు మట్టి వేసినట్లు రూ.10 లక్షలు, కంకర తోలించినట్లు రూ.4లక్షలు, రోడ్డు పనులు పూర్తిగా చేసినట్లు రూ.18.5 లక్షలు డ్రా చేశారు. రోడ్డు వేయకుండానే వేసినట్లుగా మొత్తం రూ.32.50 లక్షలు డ్రా చేశారు.

సామాజిక తనిఖీలో బట్టబయలు

గతేడాది నవంబరులో నిర్వహించిన సామాజిక తనిఖీలో ఆర్ కొట్టాల-డొనేకల్లు రోడ్డు వేయకుండానే నిధులు డ్రా చేశారని అధికారులు తేల్చారు. రికార్డుల్లో రోడ్డు వేసినట్లు నమోదు చేశారు. క్షేత్రస్థాయిలో మట్టి రోడ్డు దర్శనమిస్తోంది. కంకర వేయడంతో ఆ రోడ్డులో ప్రయాణించేందుకు రైతులు ఇబ్బందులు పడుతున్నారు. రైతులే ట్రాక్టర్లు ఏర్పాటు చేసుకుని, కంకరను రెండు కిలోమీటర్లు చదును చేయించారు. వేయని రోడ్డుకు దాదాపుగా రూ.32 లక్షలు నిధులు డ్రా చేశారు. వాటిని కూటమి ప్రభుత్వం రికవరీ చేసి, రోడ్డు వేయిస్తుందా.. లేదా.. అని మండల ప్రజలు చర్చించుకుంటున్నారు.



శిథిలమైన డొనేకల్లు-ఆర్ కొట్టాల రోడ్డు

సర్పంచ్ వాగ్వాదం

ఇదే రోడ్డుకు డొనేకల్లు సర్పంచ్ పంచాయతీ నిధులతో మట్టి పనులు చేయించారు. రూ.3 లక్షలకుపైగా వెచ్చించారు. ఆ పనులకు కూడా బిల్లులు డ్రా చేసుకున్నట్లు తెలిసింది. చేయని పనులకు బిల్లులు ఎలా చేస్తారని అధికారులను సర్పంచ్ నిలదీశారు. అప్పట్లో వాగ్వాదానికి దిగారు.

రోడ్డు వేయకుండానే ఎలా డ్రా చేస్తారు?:



ఆర్ కొట్టాల-డొనేకల్లు రోడ్డు వేయాలని అధికారుల దృష్టికి పదేపదే తీసుకెళ్లాం. రైతులు వెళ్లి వేడుకున్నా అధికారులు స్పందించలేదు. ఈ నేపథ్యంలో రోడ్డు వేయకుండానే రూ.32.50 లక్షలు ఎలా డ్రా చేశారో అధికారులే చెప్పాలి.

\- శ్రీనివాసులు, ఆర్ కొట్టాల

నిధులు డ్రా అయిన మాట వాస్తవమే

ఎన్ఆర్ఈజీఎస్ నిధులు మంజూరు కావడంతో 2024లోనే మూడుసార్లు బిల్లులు మంజూరు చేశారు. జూన్‌లో మొదటిసారి రూ.6.5 లక్షలు, రెండోసారి రూ.3.5 లక్షలు, ఆగస్టులో రూ.18 లక్షలు కాంట్రాక్టర్‌కు బిల్లులు ఇచ్చారు. 1.5 కిలోమీటరు రోడ్డుపై కంకర మాత్రమే ఉంది. బీటీ రోడ్డు వేయ లేదని తెలిసింది. దీనిపై విచారించి, చర్యలు చేపడతాం.

\- లక్ష్మీనారాయణ, పీఆర్ ఏఈ, విడపనకల్లు

కంకర రోడ్డులో నిత్యం ప్రమాదాలు



కంకర వేసి వదిలేయటంతో రైతులు ఎద్దుల బండ్లపై ఆ రోడ్డులో వెళ్లేందుకు ఇబ్బందులు పడుతున్నారు. నిత్యం ప్రమాదాల బారిన పడుతున్నారు. రోడ్డు వేయకుండానే నిధులు డ్రా చేయటం ఏంటి? ప్రభుత్వం రికవరీ చేసి, ఆర్ కొట్టాల-డొనేకల్లు రోడ్డు వేయాలి.

\- బొజ్జప్ప, ఆర్ కొట్టాల

రహదారులకు రూ. 26 కోట్లు

రోడ్లు, భవనాల శాఖ మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి



మంత్రి బీసీ జనార్దన్ రెడ్డికి స్వాగతం పలుకున్న జేసీ ప్రభాకర్ రెడ్డి

తాడిపత్రి, ఫిబ్రవరి 3(ఆంధ్రజ్యోతి): జిల్లాలో రహదారుల అభివృద్ధికి రూ.26 కోట్లు కేటాయించామని రోడ్లు, భవనాల శాఖ మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి అన్నారు. ఇందులో ఒక్క తాడిపత్రి నియోజకవర్గానికే రూ.11 కోట్లు కేటాయించామనిఅన్నారు. తాడిపత్రికి సోమవారం వచ్చిన ఆయన, మున్సిపల్ చైర్మన్ జేసీ ప్రభాకర్ రెడ్డి నివాసంలో విలేకరులతో మాట్లాడారు. జగన్ పాలనతో రాష్ట్రం నాశనమైందని విమర్శించారు. రోడ్లన్నీ గుంతలమయం అయ్యాయని, ఆ గుంతలను పూడ్చడానికి కూటమి ప్రభుత్వం రూ.1,061 కోట్లను మంజూరు చేసిందని అన్నారు. రాష్ట్రంలో రహదారులను చూసి కర్ణాటక, తమిళనాడు మంత్రులు నవ్వుకున్నారని ఎద్దేవా చేశారు. జగన్ ప్రభుత్వంలో పరిశ్రమలన్నీ వెనక్కి వెళ్లిపోవడంతో రాష్ట్రం అధోగతి పాలైందని అన్నారు. కూటమి ప్రభుత్వంలో సీఎం చంద్రబాబు అభివృద్ధి, సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నారని అన్నారు. రాష్ట్రంలో 23,400 కి.మీ. మేర రహదారులు గుంతలమయం అయ్యాయని, ఆరు నెలల్లోనే 18వేల కి.మీ. రహదారులపై గుంతలు పూడ్చామని, నాణ్యమైన రహదారులను ఇచ్చామని అన్నారు. కేంద్రమంత్రి గడ్కరీని కలిసి ఫోర్‌లైన్, డబుల్‌లైన్ రహదారులను జాతీయ రహదారులతో అనుసంధానం చేయడానికి ప్రయత్నాలు చేస్తున్నామని తెలిపారు. దీనికోసం 3,500 కి.మీ. మేర పీపీ మోడల్ తరహాలో ఎస్టిమేషన్ తయారు చేశామని అన్నారు. రాష్ట్రంలో 20 లక్షల ఉద్యోగాల కల్పన కూటమి ప్రభుత్వం లక్ష్యమని, ఇప్పటికే 5 లక్షల ఉద్యోగాలు కల్పించామని మంత్రి తెలిపారు.

జేసీపై అక్రమ కేసులు

వైసీపీ హయాంలో రాష్ట్రంలో తాడిపత్రి మున్సిపాలిటీలో మాత్రమే టీడీపీ గెలిచిందని, తాడిపత్రి అభివృద్ధి, జేసీ ప్రభాకర్‌రెడ్డి మీద ఇక్కడి ప్రజలకు ఉన్న అభిమానం దీనికి కారణమని మంత్రి అన్నారు. అలాంటి నాయకుడిపై అక్రమ కేసులు బనాయించి జైలుకు పంపించారని మండిపడ్డారు. జేసీ ప్రభాకర్ రెడ్డి అన్నింటినీ ఎదుర్కొని నిలిచారని అన్నారు. గతంలో చేసినవి మరిచి.. నేటికి వచ్చినట్లు మాట్లాడుతున్నారని వైసీపీ నాయకులపై మండిపడ్డారు.

● తాడిపత్రి పరిసర ప్రాంతాల అభివృద్ధి నాపరాతి పరిశ్రమలే కారణమని జేసీ ప్రభాకర్‌రెడ్డి అన్నారు. వాటిని కాపాడే బాధ్యత మంత్రి బీసీ జనార్దన్ రెడ్డిదేనని అన్నారు. బనగానపల్లి ప్రాంతం నుంచి నాపరాతి ముడిసరుకు ఇక్కడికి వస్తోందని అన్నారు. తాడిపత్రి, బనగానపల్లి ప్రజలు బాగుండాలంటే పరిశ్రమలు, గనులు బాగుండాలని అన్నారు. రాయితీలు ఇవ్వాలని, విద్యుత్ బిల్లులు తగ్గిస్తే పరిశ్రమలకు పూర్వవైభవం వస్తుందని అన్నారు. కాగా తన నివాసానికి వచ్చిన మంత్రికి జేసీ ప్రభాకర్‌రెడ్డి పుష్పగుచ్ఛం అందజేసి స్వాగతం పలికారు.

చారిత్రక కట్టడాలను పునరుద్ధరించండి

లోక్‌సభలో ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ



లోక్‌సభలో మాట్లాడుతున్న ఎంపీ

అనంతపురం, ఫిబ్రవరి 3(ఆంధ్రజ్యోతి): జాతీయ సాంస్కృతిక నిధి (ఎన్‌సీఎఫ్) ద్వారా రాష్ట్రంలో చారిత్రక కట్టడాలను పునరుద్ధరించాలని అనంతపురం ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ.. కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు. సోమవారం లోక్‌సభలో ప్రశ్నోత్తరాల సమయంలో ఎంపీ అంబికా మాట్లాడుతూ... ఎన్‌సీఎఫ్ ద్వారా దేశ వ్యాప్తంగా అనేక చారిత్రక కట్టడాలను పునరుద్ధరిస్తున్నారన్నారు. గత ఐదేళ్లలో ఆంధ్రప్రదేశ్‌లో ఎన్‌సీఎఫ్ కింద ఎలాంటి ప్రాజెక్టులు ఆమోదించలేదన్నారు. ఏపీలో ఎన్నో చారిత్రక ప్రదేశాలు అధ్వాన్నంగా మారిపోయాయన్నారు. తాను ప్రాతినిధ్యం వహిస్తున్న అనంతపురం పార్లమెంటు నియోజకవర్గ పరిధిలోని ప్రముఖ గుత్తి కోట రాష్ట్రంలో అతిపెద్దదన్నారు. చాళక్యులు, విజయనగర సామ్రాజ్యం, మొఘల్ పాలకులు, మరాఠాలు, బ్రిటిష్ పరిపాలనకు గుత్తి కోట నిదర్శనమన్నారు. కోట చారిత్రక ప్రాముఖ్యత మాత్రమే కాదనీ, పర్యాటకం దృష్ట్యా ఎంతో విలువైందన్నారు. ఎన్‌హెచ్-44, ఎన్‌హెచ్-67 రహదారులు.. గుత్తి రైల్వే జంక్షన్‌కు సమీపంలో ఉండటంతో పర్యాటకంగా ఆ ప్రాంతం అభివృద్ధి చెందే అవకాశం ఉందన్నారు. గుత్తికోట పునరుద్ధరణకు రూ.60కోట్ల ప్రణాళికతో సమర్పించిన ప్రతిపాదనలు నేటికీ ఆమోదం పొందలేదన్నారు. ఈ కోటను పునరుద్ధరించడం ద్వారా వైభవమైన వారసత్వాన్ని కాపాడడంతోపాటు పర్యాటకంగా అభివృద్ధి చేసి ఉపాధి అవకాశాలు కల్పించవచ్చన్నారు. ఈ ప్రాజెక్టును అత్యవసరంగా భావించి, గుత్తి కోట పునరుద్ధరణ పనులు త్వరితగతిన ఆమోదించాలని ఆయన.. ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.

పెద్దారెడ్డి గృహ నిర్బంధం

తాడిపత్రికి వెళ్లనివ్వని పోలీసులు



తిమ్మంపల్లిలో వైసీపీ నాయకులు, కార్యకర్తలతో మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి

యల్లనూరు/తాడిపత్రి, ఫిబ్రవరి 3(ఆంధ్రజ్యోతి): తాడిపత్రి మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డిని తాడిపత్రికి రానివ్వకుండా పోలీసులు అడ్డుకున్నారు. శాంతిభద్రతల సమస్య తలెత్తుతుందని భావించి, ఆయన స్వగ్రామం తిమ్మంపల్లిలో సోమవారం హౌస్ అరెస్ట్ చేశారు. తాడిపత్రి పట్టణంలో కూడా భారీ భద్రత ఏర్పాటు చేశారు. అడిషనల్ ఎస్పీ రోహిత్ కుమార్ చౌదరి ఆధ్వర్యంలో కూడళ్ల వద్ద పికెట్ ఏర్పాటు చేశారు. పెద్దారెడ్డి ఇంటివద్ద, మున్సిపల్ చైర్మన్ జేసీ ప్రభాకర్‌రెడ్డి ఇళ్ల వద్ద భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. తిమ్మంపల్లికి సోమవారం పెద్ద ఎత్తున పోలీసు బలగాలు చేరుకున్నాయి. ఎన్నికల తరువాత ఘర్షణలు జరగడంతో పెద్దారెడ్డిని పోలీసులు తాడిపత్రికి దూరంగా ఉంచుతున్నారు. ఆ కేసులలో పెద్దారెడ్డికి ప్రీ బెయిల్ లభించడంతో ఆయన తాడిపత్రికి వెళ్లేందుకు ఏర్పాట్లు చేసుకున్నారు. ఆయన వస్తే సమస్యలు తలెత్తుతాయని భావించిన పోలీసులు.. తాడిపత్రి వైపు రాకుండా చర్యలు చేపట్టారు. తిమ్మంపల్లి నుంచి తాడిపత్రి, పులివెందుల, యల్లనూరుకు వైపు వెళ్లే అన్ని రహదారులను తమ అధీనంలోకి తీసుకున్నారు. ప్రతి వాహనాన్ని తనిఖీ చేశాకే అనుమతించారు. అనంతపురం రూరల్ డీఎస్పీ వెంకటేశ్వర్లు బందోబస్తును పర్యవేక్షించారు. ఆయన తిమ్మంపల్లికి వెళ్లి పెద్దారెడ్డితో చర్చించారు. పుట్లూరు ఎస్ఐ వెంకట నరసింహం ఆయనకు నోటీసులు అందజేశారు. అనంతరం పెద్దారెడ్డి విలేకరులతో మాట్లాడారు. తాడిపత్రి నియోజకవర్గంలో తమ కార్యకర్తలపై వరుసగా దాడులు జరుగుతున్నాయని, కార్యకర్తలకు అండగా నిలబడాల్సిన బాధ్యత తనపై ఉందని పెద్దారెడ్డి అన్నారు. తాడిపత్రికి వెళ్లనివ్వకుండా పోలీసులు ఎందుకు అడ్డుకుంటున్నారో తనకు అర్థం కావడం లేదని అన్నారు. శాంతిభద్రతల సమస్య ఎందుకు వస్తుందని, పోలీసు వ్యవస్థ ఉందా లేదా అని ప్రశ్నించారు. కోర్టును ఆశ్రయించి అయినా తాడిపత్రికి వెళ్లి తీరుతానని ఆయన అన్నారు.

నువ్వొస్తే.. మేమూ వస్తాం..!

పెద్దారెడ్డి తాడిపత్రికి వస్తే తామూ తిమ్మంపల్లికి వెళతామని మున్సిపల్ కౌన్సిలర్లు మల్లికార్జున, రేష్మా పర్వీన్, జింకా లక్ష్మీదేవి, విజయ్‌కుమార్, షెక్షావలి అన్నారు. జేసీ ప్రభాకర్ రెడ్డి నివాసంలో వారు విలేకరుల సమావేశంలో మాట్లాడారు. 'తాడిపత్రికి వచ్చి ఫ్యాక్షన్ పోషిస్తావా? నీ పని నువ్వు చేసుకుంటుంటే అందరికి మంచిది' అని పెద్దారెడ్డినుద్దేశించి అన్నారు. గతంలో ఆయన చేసిన అరాచకాలు అన్నీ ఇన్ని కావని, తాడిపత్రికి వస్తానంటే ఒప్పుకునేది లేదని అన్నారు. పోలీసులను అడ్డం పెట్టుకొని కౌన్సిలర్ల మీద దాడులు చేయించారని, మహిళలను కూడా జైలుకు పంపించారని మండిపడ్డారు. ప్రబోధానంద కేసులను అడ్డంపెట్టుకుని జీవితాలను నాశనం చేశారని అన్నారు.

వైభవంగా సుబ్రహ్మణ్యేశ్వరుడి పెళ్లి



ప్రత్యేక అలంకరణలో సుబ్రహ్మణ్యేశ్వర స్వామివారు

ఆత్మకూరు ఫిబ్రవరి 3(ఆంధ్రజ్యోతి): మండలంలోని పంపనూరు సుబ్రహ్మణ్యేశ్వర ఆలయంలో సోమవారం శ్రీవల్లి, దేవసేన సమేత స్వామివారి కల్యాణం వైభవంగా నిర్వహించారు. మాఘమాస శుద్ధ షష్ఠి సందర్భంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహించినట్లు నిర్వాహకులు తెలిపారు. వందలాది మంది భక్తులు సమక్షంలో కల్యాణకట్టపై కల్యాణోత్సవాన్ని జరిపించారు. పట్టు వస్త్రాలు, పుష్పాలతో ఉత్సవ విగ్రహాలను ప్రత్యేకంగా అలంకరించారు. ఈ సందర్భంగా స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో కార్యనిర్వహణ అధికారి బాబు, ప్రధాన అర్చకులు రాము తదితరుల పాల్గొన్నారు.

రేపు హార్టికల్చర్ కాంక్లేవ్

పాల్గొననున్న 64 కంపెనీలు.. కలెక్టర్ వినోద్‌కుమార్



వివరాలు వెల్లడిస్తున్న కలెక్టర్ వినోద్‌కుమార్

అనంతపురం టౌన్, ఫిబ్రవరి3 (ఆంధ్రజ్యోతి): ప్రపంచస్థాయిలో జిల్లాకు గుర్తింపు వచ్చేలా ఈనెల 5న హార్టికల్చర్ కాంక్లేవ్ నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ డాక్టర్ వినోద్‌కుమార్ తెలిపారు. స్థానిక కలెక్టరేట్‌లో సోమవారం ఆయన విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. జిల్లా కేంద్రంలోని ఎంవైఆర్ కన్వెన్షన్ హాల్‌లో కార్యక్రమం ఉంటుందన్నారు. కాంక్లేవ్ ద్వారా జిల్లా రైతులకు ఎంతో మేలు చేకూరుతుందన్నారు. ఉద్యానపంట ఉత్పత్తుల బ్రాండింగ్, ప్రచారం, కోల్డ్‌స్టోరేజీలు, ప్రాసెసింగ్ సెంటర్ల ఏర్పాటు, మౌలిక సదుపాయాల కల్పన, మార్కెట్‌లో పోటీతత్వం పెంచడం, రైతులకు శాస్త్ర, సాంకేతిక పరిజ్ఞానంపై అవగాహన, అన్నదాతలకు రెండింతల ఆదాయం కల్పించడం కార్యక్రమం ముఖ్య ఉద్దేశమన్నారు. ఉద్యాన పంటల సాగులో రాష్ట్రంలోనే జిల్లా మొదటిస్థానంలో ఉందని చెప్పుకొచ్చారు. మొత్తం 64 కంపెనీలు వస్తున్నాయన్నారు. అదే రోజు ఆరు కంపెనీలతో ఎంఓయూలు కుదుర్చుకుంటామన్నారు. 16 మంది స్పెయిన్ ప్రతినిధులు పాల్గొంటారన్నారు. జిల్లా రైతులు సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ కోరారు.

ఆక్రమణలకు అడ్డేది..?

- కార్పొరేషన్‌లో ప్రభుత్వ స్థలాలు అన్యాక్రాంతం
- ఆదర్శనగర్‌లో మూడెకరాల కార్పొరేషన్ స్థలం
- ఖాళీ స్థలాల్లో కానరాని హెచ్చరిక బోర్డులు

అక్షరం అండగా...లో వెలుగులోకి సమస్యలు



ఆదర్శ నగర్‌లో నగరపాలక సంస్థ ఖాళీ స్థలం

అనంతపురం క్రైం, ఫిబ్రవరి 3(ఆంధ్రజ్యోతి): కొందరు రాజకీయ నాయకులు, రియల్టర్ల పుణ్యమా అని అనంతపురం కార్పొరేషన్‌కు చెందిన స్థలాలు అన్యాక్రాంత మయ్యాయి. మిగిలిన వాటినైనా కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రజాప్రతినిధులు, అధికారులపైనే ఉంది. ప్రస్తుతం అది సాధ్యం కావడం లేదు. ఇలాంటి పరిస్థితి అనంతపురం నగరంలోని 32వ డివిజన్‌లోని ఆదర్శ్‌కాలనీ, ఓబుళదేవ్‌నగర్ ప్రాంతాల్లో ఉంది. ఇక్కడ విద్యుత్‌నగర్, విద్యుత్‌శక్తినగర్, సెవెన్‌హిల్స్ కాలనీ, ఎఫ్‌సీఐ కాలనీలున్నాయి. ఇక్కడ దాదాపు 1500ఇళ్లకు సంబంధించి ఆరువేల మందికి పైగా నివాసముంటున్నారు. ఆ ప్రాంతాల ప్రజలు పార్కులు, కమ్యూనిటీ హాల్‌లు ఏర్పాటు చేయాలని కోరుతున్నారు. కానీ కార్పొరేషన్‌కు సంబంధించి ఖాళీ స్థలాలు కనిపించడం లేదు. ఈ డివిజన్ సమీపంలోని హౌసింగ్‌బోర్డు పరిధిలో దాదాపు ఎకరా స్థలం కార్పొరేషన్ ఓపెన్ స్పేస్ ఉంది. ఈ ఖాళీ స్థలాన్ని కబ్జా చేయడానికి గత వైసీపీ ప్రభుత్వంలో కొందరు ప్రయత్నించారు. బయటకు పొక్కడంతో కుదర్లేదు. ఇలాంటి ప్రయత్నాలు తరచూ జరుగుతూనే ఉన్నాయి. వీటికి కట్టుదిట్టంగా అడ్డుకట్ట వేయాలని స్థానికులు కోరుతున్నారు.

పార్కు రైతు బజారు ఎలా..?

నగరంలోని 32వ డివిజన్‌లో తాజాగా ఏబీఎన్-ఆంధ్రజ్యోతి ఆధ్వర్యంలో అక్షరం అండగా... పరిష్కారమే అజెండాగా... కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హాజరైనఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్, ఇన్‌చార్జ్ కమిషనర్ మల్లికార్జునరెడ్డి దృష్టికి స్థానికులు పలు సమస్యలు తీసుకొచ్చారు. ఈ సందర్భంగా ఆదర్శనగర్‌కు చెందిన రాజారెడ్డి మాట్లాడుతూ ఆదర్శనగర్‌లో 40 సెంట్ల కార్పొరేషన్ స్థలముందని, అది కబ్జా కాకుండా కాలనీవాసుల ఆహ్లాదం కోసం ఒక పార్కు ఏర్పాటు చేయాలని, మిగిలిన స్థలాల్లో ప్రజలకు ఉపయోగపడే పనులు చేపట్టాలని కోరారు. అదే ప్రాంతానికి చెందిన చిరువ్యాపారి నరసింహారెడ్డి మాట్లాడుతూ..పాతూరుకు వెళ్లి సరుకులు, కూరగాయలు తెచ్చుకోవాలంటే ఇబ్బందిగా ఉందని...కాలనీలో ఖాళీ స్థలంలో రైతు బజారు ఏర్పాటు చేయాలని కోరారు. ఎమ్మెల్యే సమాధానమిస్తూ 50సెంట్ల స్థలం చూడాలన్నారు. చెన్నకేశవ మాట్లాడుతూ ఆదర్శనగర్‌లో సర్వేనెంబరు 341లో రోడ్డు సరిగా లేదని...ఆ ప్రాంతంలో రోడ్లను కబ్జా చేస్తున్నారని ఆరోపించారు.

ఆదర్శనగర్‌లో మూడెకరాల కార్పొరేషన్ స్థలం

డివిజన్ పరిధిలో 2.75ఎకరాల నుంచి మూడెకరాల కార్పొరేషన్ స్థలముందని స్థానికులు చెబుతున్నారు. గతంలో ఇంకా ఎక్కువ ఉండేదని, అది ఆక్రమణకు గురైందని ఆ కాలనీవాసులు ఆరోపిస్తున్నారు. కొన్ని చోట్ల 3 సెంట్ల నుంచి 5 సెంట్ల వరకు, మరికొన్ని చోట్ల 10 సెంట్ల నుంచి 15 సెంట్ల వరకు కార్పొరేషన్‌కు చెందిన స్థలాలున్నాయి. తక్కువగా 40 నుంచి50 సెంట్ల స్థలాల వరకు అలాగే ఉన్నాయి. వాటిని అన్యాక్రాంతం కాకుండా చూడాల్సిన బాధ్యత అధికారులపై ఉంది

ఒక్క హెచ్చరిక బోర్డూ లేదు..

అనంతపురం కార్పొరేషన్‌లో టౌన్‌ప్లానింగ్ విభాగం అధికారులు వసూళ్లలో బాగా బిజీ అయ్యారు. 32వ డివిజన్ పరిధిలో ఎక్కడేగాని ఖాళీగా ఉన్న స్థలాలకు ఇది కార్పొరేషన్ స్థలమని ప్రత్యేకంగా బోర్డు ఏర్పాటు చేయలేదు. దీన్ని బట్టే కార్పొరేషన్ స్థలాన్ని కాపాడటంలో అధికారుల చిత్తశుద్ధి అర్థం అవుతోంది. అలాంటి స్థలాలకు ఫెన్సింగ్ కాదు కదా కనీసం శుభ్రం కూడా చేయించడం లేదు. టౌన్‌ప్లానింగ్ అధికారులు తమ అలసత్వాన్ని వీడితేనే కార్పొరేషన్ స్థలాలు అన్యాక్రాంతం కాకుండా ఆపగలుగుతారనడంలో ఎలాంటి సందేహం లేదు.

మంచి రోజులు వచ్చాయ్..!

- ఎస్సీ హాస్టళ్లకు మహర్దశ
- అభివృద్ధి పనులకు భారీగా నిధులు విడుదల
- రెండో విడతలో 34 హాస్టళ్లకు రూ.5.68 కోట్లు..
- పలుచోట్ల పనులు ప్రారంభం


మరమ్మతులకు ఎంపిక చేసిన ఉరవకొండలోని ఎస్సీ బాలుర వసతిగృహం

అనంతపురం ప్రెస్‌క్లబ్/ఉరవకొండ, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): సంక్షేమ వసతిగృహాల అభివృద్ధిపై రాష్ట్ర ప్రభుత్వం దృష్టి సారించింది. శిథిలావస్థకు చేరిన, మౌలిక వసతులు లేని వసతిగృహాలను ఎంపికి చేసి మరమ్మతులు చేపడుతోంది. జిల్లాలో ఇప్పటికే మరమ్మతు పనులు జరుగుతున్నాయి. దీనిపై విద్యార్థులు, తల్లిదండ్రులు, అధికారులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. వైసీపీ పాలనలో పట్టించుకోకపోవడంతోనే సంక్షేమ వసతి గృహాలు అధ్వాన స్థితికి చేరాయని వారు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

తొలి దశలో పది ఎస్సీ హాస్టళ్లు

జిల్లాలో తొలి దశలో 10 ఎస్సీ హాస్టళ్లు, ఒక గురుకుల పాఠశాలను అభివృద్ధి చేయడా నికి ఎంపిక చేశారు. ఆయా భవనాల మరమ్మతుల కోసం రూ. 1.85 కోట్లు విడుదల చేశారు. మూడు నెలల్లోనే పనులు పూర్తి చేశారు. బీసీ సంక్షేమశాఖాధికారులు జిల్లా వ్యాప్తంగా 55 బీసీ సంక్షేమ వసతిగృహాలను అభివృద్ధి కోసం ఎంపిక చేశారు. ఇందులో 28 వసతి గృహాలకు మరమ్మతులు, మౌలిక వసతుల కల్పన, 27 వసతిగృహాలకు సీసీ కెమెరాలు ఏర్పాటు చేసేందుకు నివేదికలు పంపారు. ఇప్పటికే వీటిన్నింటి కోసం దాదాపు రూ.3.67 కోట్లు అంచనాలు వేసి పంపగా... ఆయా హాస్టళ్లల్లో పనులు కొనసాగుతున్నాయి. తాజాగా రెండో విడత కింద 34 ఎస్సీ హాస్టళ్లను ఎంపిక చేసి రూ. 5.68 కోట్ల నిధులను విడుదల చేశారు. ఇప్పటికే పలు డివిజన్లలో పనులు ముమ్మరంగా సాగుతున్నాయి.

డివిజన్ల వారీగా నిధుల కేటాయింపు

రెండో దశలో 34 ఎస్సీ హాస్టళ్ల మరమ్మతులు చేసేందుకు రూ. 5.68 కోట్లు నిధులు విడుదల చేశారు. అందులో అనంతపురం డివిజన్‌లో నెం-1 ప్రీమెట్రిక్ బాలికల వసతిగృహానికి రూ. 16.20 లక్షలు, నెం-2 ప్రీమెట్రిక్ బాలుర వసతిగృహానికి రూ. 17.4 లక్షలు, నెం-4 బాలుర ప్రీమెట్రిక్ వసతి గృహానికి రూ. 22 లక్షలు, ఉరవకొండలోని నెం-2 బాలికల వసతిగృహానికి రూ.17.5 లక్షలు, ఉరవకొండ బాలుర కాలేజీ వసతిగృహానికి రూ. 16 లక్షలు, ఉరవకొండ బాలికల నెం-1 వసతిగృహానికి రూ.17.5 లక్షలు, చాబాల గ్రామ ఎస్సీ బాలుర వసతిగృహానికి రూ.6.7 లక్షలు, ఉరవకొండలోని నెం-2 బాలుర వసతిగృహానికి రూ. 12 లక్షలు, గడేకల్లులోని బాలుర వసతిగృహానికి రూ. 13.5 లక్షలు, కొనకొండ్లలోని బాలుర వసతిగృహానికి రూ.13.61 లక్షలు, వజ్రకరూరులోని బాలికల వసతిగృహానికి రూ.17.78 లక్షలు, తాడిపత్రి డివిజన్‌కు సంబంధించి చుక్కలూరు బాలుర వసతిగృహానికి రూ.18 లక్షలు, తాడిపత్రి బాలికల కాలేజీ వసతిగృహానికి రూ. 28.56 లక్షలు, తాడిపత్రిలోని బాలికల ప్రీమెట్రిక్ వసతిగృహానికి రూ.17.5 లక్షలు, యాడికి బాలికల వసతిగృహానికి రూ.18.9 లక్షలు, దిమ్మగుడి బాలుర వసతిగృహానికి రూ. 13.1 లక్షలు, పెద్ద వడుగూరులోని బాలుర వసతిగృహానికి రూ.13.6 లక్షలు, గుత్తిలోని నెం-1 బాలుర వసతిగృహానికి రూ.14.55 లక్షలు, పామిడి బాలుర వసతిగృహానికి రూ.24.51 లక్షలు, గుత్తి బాలుర కాలేజీ వసతిగృహానికి రూ.17.4 లక్షలు, బుక్కరాయసముద్రంలోని బాలుర వసతిగృహానికి రూ. 20.80 లక్షలు, నార్పల బాలుర వసతిగృహానికి రూ. 19.09 లక్షలు, నార్పల బాలికల వసతిగృహానికి రూ. 19.61, తరిమెల బాలుర వసతిగృహానికి రూ. 22.38 లక్షలు, కళ్యాణదుర్గం డివిజన్‌లోని కళ్యాణదుర్గం నెం-1 బాలికల వసతిగృహానికి రూ. 11.42, కళ్యాణదుర్గం బాలుర కాలేజీ వసతిగృహానికి రూ.17.4 లక్షలు, కళ్యాణదుర్గం బాలికల కాలేజీ వసతిగృహానికి రూ.8.37 లక్షలు, కళ్యాణదుర్గం నెం-3 బాలుర వసతిగృహానికి రూ. 18.2 లక్షలు, కంబదూరు బాలుర కాలేజీ వసతిగృహానికి రూ. 17.38 లక్షలు, కళ్యాణదుర్గం నెం-2 బాలికల వసతి గృహానికి రూ. 13.86 లక్షలు, సోమలాపురం బాలుర వసతి గృహానికి రూ. 17.31 లక్షలు, రాయదుర్గంలోని బాలికల వసతిగృహానికి రూ.17.34 లక్షలు, బ్రహ్మసముద్రంలోని బాలుర వసతిగృహానికి రూ.14.30 లక్షలు చొప్పున మొత్తం 34 వసతి గృహాలకు రూ.5.68 నిధులు విడుదలయ్యాయి.


గుత్తిలో మరమ్మతులకు నోచుకున్న ఎస్సీ బాలుర వసతి గృహం

అన్ని హంగులతో...



జిల్లాలో ఎస్సీ వసతిగృహాల మరమ్మతులకు విరివిగా నిధులు విడుదలవుతున్నాయి. మొదటి విడతలో 10 హాస్టళ్లు, ఒక గురుకులానికి సంబంధించి రూ. 1.85 కోట్లు విడుదలవ్వగా... పనులు పూర్తి చేసి ఆయా నియోజకవర్గాల ప్రజాప్రతినిధులతో ప్రారంభించాం. ప్రస్తుతం రెండో విడత కింద 34 హాస్టళ్లకు రూ. 5.68 కోట్లు నిధులు విడుదలయ్యాయి. త్వరలోనే అన్ని డివిజన్లలో అన్ని హాస్టళ్లకు మరమ్మతు పనులు పూర్తవుతాయి. అన్ని వసతిగృహాలు నూతన హంగులతో రూపుదిద్దుకోనున్నాయి.

- ప్రతాప్ సూర్యనారాయణరెడ్డి, డీడీ, ఎస్సీ వెల్ఫేర్

జిల్లాలో మల్టీ పర్పస్ స్టేడియం నిర్మిస్తాం

క్రీడావికాస కేంద్రాల నిర్మాణాలు పూర్తి చేస్తాం
ఒక క్రీడ... ఒకే సంఘం.. అమలు చేస్తాం..
క్రీడారంగాన్ని సర్వనాశనం చేసిన వైసీపీ ప్రభుత్వం
శాప్ చైర్మన్ అనిమిని రవినాయుడు


మాట్లాడుతున్న శాప్ చైర్మన్ అనిమిని రవినాయుడు

అనంతపురం క్లాక్‌టవర్, ఫిబ్రవరి 3(ఆంధ్రజ్యోతి): ప్రతిభావంతులైన క్రీడాకారులకు నిలయమైన జిల్లాలో మల్టీపర్పస్ స్టేడియం నిర్మిస్తామనీ, ఇందుకు స్థల పరిశీలన చేస్తున్నామని రాష్ట్ర క్రీడాప్రాధికార సంస్థ (శాప్) చైర్మన్ అనిమిని రవినాయుడు పేర్కొన్నారు. స్థానిక అశోక్‌నగర్‌లోని జిల్లా క్రీడాప్రాధికార సంస్థ (డీఎస్‌ఏ) ఇండోర్ స్టేడియంలో సోమవారం ఆయన మాట్లాడారు. వైసీపీ పాలనలో క్రీడారంగాన్ని సర్వనాశనం చేశారని మండిపడ్డారు. రాష్ట్రంలో క్రీడారంగానికి పూర్వవైభవం తీసుకురావడానికి సీఎం చంద్రబాబునాయుడు కృషి చేస్తున్నారన్నారు. నూతన క్రీడాపాలసీని తీసుకువచ్చారని తెలిపారు. జిల్లాలో ఆర్డీటీ ఉండడం క్రీడాకారులకు వరమన్నారు. ఇలాంటి అవకాశం ప్రతి జిల్లాలో ఉండేలా ప్రభుత్వంతో కలిసి పనిచేసేందుకు ఆర్డీటీ ముందుకువచ్చిందని తెలిపారు. పెండింగ్‌లో ఉన్న క్రీడావికాస కేంద్రాలను పూర్తి చేసి, అన్ని వసతులు కల్పిస్తామన్నారు. జిల్లా నుంచి వైసీపీ ప్రభుత్వం తరిమికొట్టిన సాయ్ కేంద్రాలు, అకాడమీలను తిరిగి ప్రారంభిస్తామన్నారు. రాష్ట్రవ్యాప్తంగా 44వేల పాఠశాలలకు రూ.30వేలు చొప్పున రూ.18.5 కోట్లతో క్రీడాసామగ్రి అందజేసేందుకు రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ చర్యలు చేపట్టారన్నారు. ఎన్నికలకు ముందు వైసీపీ ప్రభుత్వం చేపట్టిన 'ఆడుదాం ఆంధ్రా' కోసం రూ.119కోట్ల నిధులు ఖర్చు చేయగా.. అందులో రూ.40కోట్లు దుర్వినియోగమైందన్నారు. దీంట్లో తాడేపల్లి ప్యాలెస్‌లో ఉన్న సైకో రాజు, సజ్జల రామకృష్ణారెడ్డి, రోజా, అప్పటి శాప్ చైర్మన్ బైరెడ్డి సిద్ధార్థరెడ్డిపై కచ్చితంగా కేసు నమోదు చేసి, నిధులు కక్కిస్తామని స్పష్టం చేశారు. అనంతరం డీఎస్‌డీఓ ఉదయ్‌భాస్కర్, కోచ్‌లతో సమావేశమయ్యారు. క్రీడాకారులు, క్రీడా సంఘాలు, తల్లిదండ్రుల నుంచి వినతులు స్వీకరించారు. కార్యక్రమంలో జిల్లా బ్యాడ్మింటన్ అసోసియేషన్ అధ్యక్షుడు బుగ్గయ్యచౌదరి, ఫుట్‌బాల్ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు వేణుగోపాల్, డీఎస్‌ఏ అధ్యక్ష, కార్యదర్శులు శ్రీనివాసులు, పీవీకేకే సుబ్బారావు పాల్గొన్నారు.

16న జిల్లాస్థాయి వెటరన్ బ్యాడ్మింటన్ పోటీలు

జిల్లా షటిల్ బ్యాడ్మింటన్ అసోసియేషన్ అధ్యక్షుడు బుగ్గయ్యచౌదరి

అనంతపురం క్లాక్‌టవర్, ఫిబ్రవరి 3(ఆంధ్రజ్యోతి): జిల్లాస్థాయి వెటరన్ బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్ ఈనెల 16వ తేదీన అశోక్‌నగర్‌లోని డీఎస్‌ఏ ఇండోర్ స్టేడియంలో నిర్వహించనున్నట్లు జిల్లా షటిల్ బ్యాడ్మింటన్ అసోసియేషన్ అధ్యక్షుడు బుగ్గయ్య చౌదరి తెలిపారు. టోర్నీకి సంబంధించిన పోస్టర్లు సోమవారం ఇండోర్ స్టేడియంలో శాప్ చైర్మన్ అనిమిని రవినాయుడు చేతుల మీదుగా విడుదల చేశారు. బుగ్గయ్యచౌదరి మాట్లాడుతూ.. వెటరన్ సింగిల్స్, డబుల్స్‌లో 35ప్లస్, 40ప్లస్, 45ప్లస్, 50ప్లస్, 55ప్లస్, 60ప్లస్ క్యాటగిరీల్లో పోటీలు ఉంటాయన్నారు. ఆసక్తి, అర్హతగల వారు ఈనెల 14వ తేదీలోపు పేర్లను నమోదు చేసుకోవాలని తెలిపారు. ఎంపికైన వారు రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారన్నారు. వివరాలకు 9966103956, 9703263984 నంబర్లలో సంప్రదించాలని కోరారు. కార్యక్రమంలో అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.

టమోటా కిలో రూ.14



అనంతపురం రూరల్, ఫిబ్రవరి 3(ఆంధ్రజ్యోతి): స్థానిక కక్కలపల్లి టమోటా మార్కెట్‌లో కిలో టమోటా గరిష్ఠంగా రూ.14తో అమ్ముడుపోయినట్లు రాప్తాడు మార్కెట్ యార్డు కార్యదర్శి రాంప్రసాద్ తెలిపారు. మార్కెట్‌కు సోమవారం 600 టన్నుల టమోటా దిగుబడులు వచ్చాయన్నారు. కిలో సరాసరి ధర రూ. 11, కనిష్ఠ ధర రూ. 7 పలికినట్లు ఆయన తెలిపారు.

చీనీ టన్ను రూ.19 వేలు



అనంతపురం రూరల్, ఫిబ్రవరి 3(ఆంధ్రజ్యోతి): స్థానిక వ్యవసాయ మార్కెట్‌లో సోమవారం చీనీకాయలు టన్ను గరిష్ఠంగా రూ. 19వేలు పలికినట్లు మార్కెట్ ఎంపిక శ్రేణికార్యదర్శి గోవిందు తెలిపారు. కనిష్ఠంగా రూ.8వేలు, సరాసరి రూ. 10,100తో అమ్ముడుపోయినట్లు తెలిపారు. మార్కెట్‌కు మొత్తం 23 టన్నుల చీనీకాయలు వచ్చాయన్నారు.

గుర్తు తెలియని భయం

యల్లనూరులో గుర్తుతెలియని వ్యక్తుల సంచారం?
ఇటీవల ఒకేరోజు నాలుగిళ్లలో చోరీ
ఇది వారి పనేనని అనుమానం
రాత్రయితే దొంగల కోసం ప్రజల జాగరణ

యల్లనూరు, ఫిబ్రవరి 3(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో గుర్తుతెలియని వ్యక్తుల సంచారముందని జోరుగా ప్రచారం సాగుతున్న నేపథ్యంలో ప్రజలు భయాందోళన చెందుతున్నారు. ఇటీవల ఒకేరోజు నాలుగు దొంగతనాలు జరగడంతో అనుమానం బలపడుతోంది. రెండు కాలనీల్లో గుర్తు తెలియని వ్యక్తులు సంచరించారని, గతంలో తాము ఎప్పుడు వారిని చూడలేదని స్థానికులు చెబుతుండటంతో మండలవాసుల్లో గుబులురేగుతోంది. గతనెల 19న యల్లనూరులో దేవర తర్వాత ఒకేరోజు నాలుగిళ్లల్లో చోరీలు జరిగాయి. దీంతో రాత్రిపూట ప్రజలు కంటి మీద కునుకు లేకుండా గడుపుతున్నారు.



అయితే పోలీసులు ఈ విషయాన్ని ఏమాత్రం పట్టించుకోవడం లేదనే విమర్శలు వ్యక్తం అవుతున్నాయి. గతనెల 24న అర్ధరాత్రి సమయంలో ఎస్సీకాలనీలో పుల్లమ్మ, ప్రహ్లాద ఇంటిలో దొంగలు చొరబడి ఇంటిలో ఉన్న నగదుతోపాటు బంగారు ఆభరణాలు అపహరించారు. వెంటనే బీసీకాలనీలోకి ప్రవేశించిన దొంగలు మనోహర్ ఇంటి తాళాన్ని పగలగొట్టి చొరబడి ఇంటిలోని బంగారు వస్తువులతోపాటు మొత్తం రూ.65వేలకుపైగా విలువైన వస్తువులు ఎత్తుకువెళ్లారు. అక్కడి నుంచి యల్లనూరు- తాడిపత్రి ప్రధానరహదారిపై ఊతప్ప ఇంటిలోకి ప్రవేశించి బీరువాను పగలగొడుతుం డగా ఇంటిపక్కన వారు గమనించి గట్టిగా అరవడంతో పారిపోయారు. నిత్యం ఈ రహదారిపై వాహనాలు తిరుగుతుంటాయి. అయినా కూడా దొంగలు నిర్భయంగా దొంగతనానికి ప్రయత్నించారంటే పోలీసుల పనితీరు ఎలా ఉందో అర్థమవుతుంది.

కొత్త వ్యక్తుల సంచారం?

యల్లనూరు గ్రామ దేవర సందర్భంగా కొత్త వ్యక్తులు మండలకేంద్రానికి చేరుకున్నట్లు సమాచారం. వీరు రాత్రి పూట ఇళ్లమీద పడి దొంగతనాలకు పాల్పడుతున్నారనే అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. వీరు పగటి పూటఎవరికి అనుమానం రాకుండా ప్లాస్టిక్ బాటిళ్లు, చెత్తాచెదారం ఏరుకొంటూ రెక్కీ నిర్వహిస్తున్నట్లు సమాచారం. ఇళ్లకు తాళాలు వేసిన వాటిని గుర్తుపెట్టుకొని అర్ధ రాత్రి సమయంలో చోరీలకు పాల్పడుతున్నట్లు తెలిసింది.

జాగరణ చేస్తున్న ప్రజలు

ఒకేరోజు నాలుగు ఇళ్లల్లో దొంగతనాలు జరగడంతో ప్రజలు రాత్రి పూట దొంగల భయంతో జాగరణ చేస్తున్నారు. పాతపేటలో బీసీకాలనీలో శనివారం రాత్రి ఆరుగురు గుర్తుతెలియని వ్యక్తులు పరిగెత్తుకుంటూ వెళ్లారని, ఆ సమయంలో కాలనీవాసులు కేకలు వేస్తూ వారిని వెంబడించారు. అయినప్పటికి వారు పరారయ్యారు. కోటవీధిలో గత నెల 26న రాత్రి నలుగురు గుర్తుతెలియని వ్యక్తులు రాత్రి 12గంటల సమయంలో కనిపించారని చర్చించుకుంటున్నారు. దీంతో చిన్నా, పెద్ద తేడా లేకుండా పహారా కాస్తున్నారు.

నిద్రమత్తు వీడని పోలీసులు

మండలకేంద్రంలో ఇంత జరుగుతున్నా పోలీసులు మాత్రం నిద్రమత్తు వీడటం లేదు. సాధారణంగా అర్ధరాత్రి సమయంలో పోలీసు సిబ్బంది బీట్‌కు వెళ్లాల్సి ఉంటుంది. కానీ ఆ పని సక్రమంగా చేయడం లేదనే విమర్శలు వ్యక్తం అవుతున్నాయి. సిబ్బంది కొరత చూపుతూ విధుల్లో నిర్లక్ష్యం వహిస్తున్నారన్న ప్రచారం ఉంది. మండలానికి ఎస్‌ఐ స్థాయి అధికారి లేకపోవడంతో ఇక్కడ సిబ్బంది ఆడిందే ఆట పాడిందే పాటగా ఉందన్న ప్రచారం జోరుగా సాగుతోంది. పోలీసు ఉన్నతాధికారులైనా చొరవచూపి దొంగల ఆగడాలను అరికట్టాలని మండల ప్రజలు కోరుతున్నారు.


పుల్లమ్మ ఇంటిలోని బీరువాను పగలగొట్టిన దుండగులు (ఫైల్)


- దొంగతనాలపై ప్రత్యేక దృష్టి పెట్టామని, రాత్రి సమయంలో గస్తీ ఏర్పాటు చేశామని సర్కిల్ సీఐ సత్యబాబు పేర్కొన్నారు. త్వరలోనే దొంగలను పట్టుకుంటామని తెలిపారు.

7 నుంచి రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ పోటీలు


అథ్లెటిక్స్ పోస్టర్లు విడుదల చేస్తున్న ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్

అనంతపురం క్లాక్‌టవర్, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రస్థాయి మాస్టర్ అథ్లెటిక్స్ పోటీలు ఈనెల 7 నుంచి 10వ తేదీ వరకు స్థానిక నీలం సంజీవరెడ్డి పీటీసీ స్టేడియంలో నిర్వహించనున్నట్లు జిల్లా మాస్టర్స్ అథ్లెటిక్ అసోసియేషన్ అధ్యక్షకార్యదర్శులు సుధాకర్‌బాబు, సికిందర్ తెలిపారు. పోటీలకు సంబంధించిన పోస్టర్లను సోమవారం స్థానిక ఆర్‌అండ్‌బీ అతిథిగృహంలో శాప్ చైర్మన్ రవినాయుడు, ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ చేతుల మీదుగా విడుదల చేశారు. మహిళలు, పురుషులకు వేర్వేరుగా పరుగు, స్పీడ్‌వాక్ పోటీలు ఉంటాయన్నారు. వివరాలు, పేర్ల నమోదుకు 9502539888 నంబరులో సంప్రదించాలని కోరారు.

పిల్లల ఆరోగ్య సంరక్షణకే ఆల్బెండజోల్: కలెక్టర్


పోస్టర్లను ఆవిష్కరిస్తున్న కలెక్టర్, అసిస్టెంట్ కలెక్టర్, డీఎంహెచ్‌ఓ

అనంతపురం టౌన్, ఫిబ్రవరి 3(ఆంధ్రజ్యోతి): పిల్లల ఆరోగ్య సంరక్షణకు ఆల్బెండజోల్ మాత్రలు పంపిణీ చేయనున్నట్లు కలెక్టర్ వినోద్‌కుమార్ పేర్కొన్నారు. వైద్యశాఖ ముద్రించిన జాతీయ నులిపురుగుల నివారణ దినం పోస్టర్లను స్థానిక కలెక్టరేట్‌లో సోమవారం ఆవిష్కరించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ.. నులిపురుగులు కడుపులో ఉంటే పిల్లలు అనేక అనారోగ్య సమస్యలు ఎదుర్కొంటారన్నారు. రక్తహీనత, పోషకాల లోపం, ఆకలి మందగించడం, నీరసం, శారీరక, మానసిక ఎదుగుదలపైనా ప్రమాదం ఏర్పడుతుందన్నారు. వీటి నివారణకు ఈనెల 10న జాతీయ నులిపురుగుల నివారణ దినాన్ని పురస్కరించుకుని జిల్లావ్యాప్తంగా ఆల్బెండజోల్ మాత్రలు పంపిణీ చేస్తామన్నారు. ఏడాది నుంచి ఐదేళ్లలోపు పిల్లలకు అంగన్‌వాడీ కేంద్రాలు, ఆ తర్వాత వయసు వారికి పాఠశాలలు, కళాశాలల్లో పంపిణీ వేస్తారన్నారు. కార్యక్రమాన్ని అధికారులు సమన్వయంతో విజయవంతం చేయాలని కలెక్టర్ ఆదేశించారు. కార్యక్రమంలో అసిస్టెంట్ కలెక్టర్ వినూత్న, జిల్లా వైద్యాధికారి ఈబీ దేవి పాల్గొన్నారు.

మళ్లీ ప్రైవేటుకే..

శివశంకర్ ఎంటర్ ప్రైజెస్‌కు వాహనాల ఫిట్‌నెస్ పరీక్షల బాధ్యతలు
కార్యాలయానికి రావద్దంటున్న ఆర్టీఏ అధికారులు


శివశంకర్ ఎంటర్‌ప్రైజెస్ ఆటోమెటెడ్ ఫిట్‌నెస్ టెస్టింగ్ కేంద్రం

అనంతపురం అర్బన్, ఫిబ్రవరి 3(ఆంధ్రజ్యోతి): వాహనాల ఫిట్‌నెస్ పరీక్షల నిర్వహణ బాధ్యతలను మళ్లీ ప్రైవేటు ఏజెన్సీకి అప్పగించారు. ఈ మేరకు ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. దీంతో గత వారం రోజుల నుంచి ఆర్టీఏ కార్యాలయాల్లో ఫిట్‌నెస్ పరీక్షలను నిలిపివేశారు. తిరిగి శివశంకర్ ఎంటర్‌ప్రైజెస్ సంస్థ ఆటోమెటెడ్ ఫిట్‌నెస్ మేనేజ్‌మెంట్ సిస్టం(ఏఎఫ్‌ఎంఎస్) కేంద్రంలో ఫిట్‌నెస్ పరీక్షలు మొదలు పెట్టారు. గతేడాది సెప్టెంబరు నుంచే ఈ సంస్థకు వాహనాల ఫిట్‌నెస్ పరీక్షల నిర్వహణ బాధ్యత అప్పగించారు. ఈ నేపథ్యంలో ఆర్టీఏ కార్యాలయాలకు బదులుగా అక్టోబరు నెలాఖరు దాకా ప్రైవేటు కేంద్రంలోనే వాహనాలకు పరీక్షలు నిర్వహించారు. రాష్ట్ర వ్యాప్తంగా ప్రైవేటు ఏజెన్సీల్లో ఫిట్‌నెట్ పరీక్షల నిర్వహణకు సంబంధించి ఆర్థిక శాఖ అనుమతులు లేని కారణంతోనే గతేడాది నవంబరు మొదటి వారంలో ప్రైవేటు ఏజెన్సీల్లో పరీక్షలను తాత్కాలికంగా నిలిపేశారు. అప్పటి నుంచి జనవరి 25వతేదీ వరకు ఆర్టీఏ కార్యాలయాల్లో వాహనాల ఫిట్‌నెస్ పరీక్షలు నిర్వహించారు. ఆర్థిక శాఖ అనుమలు మంజూరైన నేపథ్యంలో ప్రైవేటు ఏజెన్సీకి తిరిగి ఫిట్ నెట్ పరీక్షల నిర్వహణ బాధ్యతలు అప్పగించారు. దీంతో గత వారం రోజుల నుంచి జాతీయరహదారి నుంచి అయ్యవారిపల్లికి వెళ్లే దారిలోని శివశంకర్ ఎంటర్‌ప్రైజెస్ సంస్థ కేంద్రంలో వాహనాలకు ఫిట్‌నెస్ పరీక్షలు నిర్వహిస్తున్నారు.


వాహనాల ఫిట్‌నెస్‌ను పరీక్షించే పరికరాలు


వాహనాల ఫిట్‌నెస్ పరీక్ష చేసే ట్రాక్


చలానా కట్టిన వాహనదారులకు నిరాశే..!

జనవరి 25దాకా జిల్లాలోని 62 మంది తమ వాహనాలకు ఫిట్‌నెస్ సర్టిఫికెట్ కోసం పరివాహన్ సైట్‌లో చలానా కట్టారు. ఆయా వాహనదారులు సంబంధిత ఆర్టీఏ కార్యాలయాలకు తమ వాహనాలను తీసుకువెళ్లగా ఇక్కడ ఫిట్‌నెస్ సర్టిఫికెట్ కోసం పరీక్ష చేయరని, తిరిగి శివశంకర్ ఎంటర్‌ప్రైజెస్ కేంద్రానికి వెళ్లాలని సమాధానం ఇస్తున్నారు. దీంతో వారు నిరాశతో వెనుదిరుగుతున్నారు. పరివాహన్‌లో ఎఫ్‌సీ కోసం స్లాట్ బుక్ చేసుకున్న వారికి కట్టిన చలానా డబ్బులు వెనక్కి ఇస్తామని ఆర్టీఏ అధికారులు చెబుతున్నారు.

ప్రైవేటు కేంద్రానికి వెళ్లాల్సిందే..

అనంతపురం, తాడిపత్రి, గుంతకల్లు, రాయదుర్గం ఆర్టీఏ కార్యాలయ పరిధిలోని అన్ని రకాల వాహనాలకు ఇదివరకు ఆయా ఆర్టీఏ కార్యాలయాల్లో ఫిట్‌నెస్ పరీక్షలు నిర్వహించేవారు. ప్రభుత్వం వాహనాల ఫిట్‌నెస్ పరీక్ష నిర్వహణ బాధ్యతలను తిరిగి ప్రైవేటు ఏజెన్సీకి అప్పగించడంతో ఇక నుంచి జిల్లాలోని అన్ని రకాల వాహనదారులు జిల్లా కేంద్రం సమీపంలోని శివశంకర్ ఎంటర్‌ప్రైజెస్ ఏజెన్సీ కేంద్రానికి వెళ్లాల్సిందే. అక్కడ ఆటోమెటెడ్ ఫిట్‌నెస్ మేనేజ్‌మెంట్ సిస్టం(ఏఎఫ్‌ఎంఎస్) ద్వారా 15 రకాల పరికరాలతో వాహనాల ఫిట్‌నెస్‌ను పరీక్షిస్తామని ఏజెన్సీ నిర్వాహకులు పేర్కొన్నారు. ఆయా పరీక్షల్లో వాహనం ఫిట్‌గా ఉన్నట్లు నిర్ధారణ అయితేనే ఫిట్‌నెస్ సర్టిఫికెట్ జారీ చేస్తారు. ఇప్పటి నుంచి ప్రైవేటు ఏజెన్సీ కేంద్రంలో వాహనాల ఫిట్‌నెస్ పరీక్షల కోసం vahan.parivahan.gov.in.AFMS సైట్‌లో చలానాలు కట్టాల్సి ఉంటుందని అధికారులు వెల్లడించారు.

చలానా డబ్బులు రీఫండ్ చేస్తాం



వాహనాలకు ఫిట్‌నెస్ పరీక్ష నిర్వహణ, సర్టిఫికెట్ జారీ బాధ్యతలను తిరిగి శివశంకర్ ఎంటర్‌ప్రైజెస్ ఏజెన్సీకి అప్పగించారు. జనవరి 27 నుంచి తిరిగి ఫిట్‌నెస్ పరీక్షల బాధ్యత ఏజెన్సీకి వెళ్లింది. వాహనదారులు ఇక నుంచి ఆర్టీఏ కార్యాలయాలకు ఫిట్‌నెస్ సర్టిఫికెట్ కోసం రావాల్సిన అవసరం లేదు. జిల్లాలోని అన్ని రకాల వాహనాలను ఫిట్‌నెస్ పరీక్ష కోసం ప్రైవేటు ఏజెన్సీ కేంద్రానికి తీసుకువెళ్లాలి. జనవరి 25 దాకా పరివాహన్ సైట్‌లో చలానాలు కట్టిన వారికి ప్రభుత్వం ఆ డబ్బులను రీఫండ్ ఇస్తుంది. ఆయా వాహనదారులు పేమెంట్ రసీదు, వాహన యమాని బ్యాంక్ పుస్తకం, ఆర్‌సీ, ఆధార్ జిరాక్స్‌లతోపాటు అర్జీని అనంతపురం డీటీసీ కార్యాలయంలో సమర్పించాలి. ఆయా అర్జీలను కమిషనరేట్‌కు పంపించి, కట్టిన డబ్బులను రీఫండ్ అయ్యేలా చూస్తాం.

-వీర్రాజు, జిల్లా ట్రాన్స్‌పోర్టు అధికారి

ఎస్సీ మహిళల కోసం పీఎంఏజేఏవై

డీఆర్‌డీఏ-వెలుగు పీడీ ఈశ్వరయ్య


సమావేశమైన డీఆర్‌డీఏ-వెలుగు పీడీ ఈశ్వరయ్య

అనంతపురం క్లాక్‌టవర్, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): స్వయం సహాయక సంఘాల్లోని దళిత మహిళల జీవనోపాధుల పెంపునకు ప్రధానమంత్రి అనుసుచిత జాతి అభ్యుదయ యోజన (పీఎంఏజేఏవై)ను ప్రవేశపెట్టినట్లు డీఆర్‌డీఏ-వెలుగు పీడీ ఈశ్వరయ్య తెలిపారు. స్థానిక బుడ్డప్పనగర్‌లోని ప్రశాంతి జిల్లా సమాఖ్య కార్యాలయంలో సోమవారం పథకంపై అవగాహన సదస్సు నిర్వహించారు. పీడీ ఈశ్వరయ్య మాట్లాడుతూ.. అర్హులైన మహిళలు పథకం కింద రూ.1 లక్ష నుంచి రూ.3లక్షల వరకు సబ్సిడీతో కూడిన రుణం పొందవచ్చన్నారు. ఇందులో సభ్యులు 10శాతం వాటా చెల్లించాల్సి ఉంటుందన్నారు. ఉన్నతి యూనిట్ ద్వారా తీసుకున్న వడ్డీలేని రుణానికి 50 శాతంగానీ, రూ.50వేలుగానీ సబ్సిడీ వర్తిస్తుందన్నారు. దీనిని సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో ఎస్సీ కార్పొరేషన్ ఈడీ ప్రతాప్ సూర్యనారాయణరెడ్డి, ఏపీఎం మంజుల, ఉన్నతి సభ్యులు పాల్గొన్నారు.

936 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో

బెళుగుప్ప, ఫిబ్రవరి 3(ఆంధ్రజ్యోతి): మండలంలోని జీడిపల్లి రిజర్వాయర్‌కు సోమవారం కృష్ణా జలాల ఇన్‌ఫ్లో 936 క్యూసెక్కులున్నట్లు హంద్రీనీవా అధికారులు తెలిపారు. అలాగే ఔట్‌ఫ్లో కింద హెచ్‌ఎన్‌ఎస్‌ఎస్ ఫేజ్-2కు 467 క్యూసెక్కులు వెళుతున్నాయన్నారు. ప్రస్తుతం రిజర్వాయర్‌లో 1.681 టీఎంసీల నీటి నిల్వ ఉన్నట్లు పేర్కొన్నారు.

రేపటి నుంచి బ్రహ్మోత్సవాలు

● కొండమీదరాయుడి ఉత్సవాలకు సర్వం సిద్ధం ● పది రోజుల పాటు వాహన సేవలు

బుక్కరాయసముద్రం, ఫిబ్రవరి 3(ఆంధ్రజ్యోతి): భక్తుల కొంగుబంగారంగా భాసిల్లుతున్న కొండమీదరాయుడు బ్రహ్మోత్సవాలకు సర్వం సిద్ధమైంది. స్థానిక దేవరకొండపై పుట్టశిలగా కొలువుదీరిన కొండమీదరాయుడు స్వామి బ్రహ్మోత్సవాలు బుధవారం నుంచి ప్రారంభం కానున్నాయి. ఇందుకు సంబంధించి ఆలయ కమిటీ సభ్యులు అన్ని ఏర్పాట్లు చేసింది. ఈనెల 14వరకు బ్రహ్మోత్సవాలు జరగనున్నాయి. ఉత్సవాల సందర్భంగా శ్రీవారు విహరించే 11వాహనాలను సర్వాంగ సుందరంగా ముస్తాబు చేశారు. ఈ బ్రహ్మోత్సవాలలో ప్రధాన ఘట్టమైన రథోత్సవం ఫిబ్రవరి 12న జరగనున్నది. ప్రతి ఏటా మాఘ మాసంలో అత్యంత వైభవంగా జరిగే ఈ బ్రహ్మోత్సవాలు తిలకించడానికి ఏపీతో పాటు కర్ణాటక రాష్ట్రం నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో తరలివస్తారు.



దేవరకొండపై ఉన్న దేవాలయం



స్వామి వారి ఉత్సవ మూర్తులు

వాహన సేవలు ఇలా ...

బ్రహ్మోత్సవాలలో భాగంగా ఈ నెల 5న స్థానిక కొండ మీద వెంకరమణస్వామి దేవాలయంలో శ్రీవారి ఉత్సవ విగ్రహమూర్తులకు వేదపండితులు ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు. అనంతరం స్వామి వారి ఉత్సవమూర్తులను పల్లకీలో ఉంచి, గ్రామ వీధుల్లో ఊరేగిస్తారు. అనంతరం స్వామి కొలువుదీరిన దేవరకొండపైకి తీసుకెళతారు. అనంతరం స్వామి వారిని దేవరకొండపై ఆలయంలో ఉంచి 6న ఉదయం ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు. అనంతరం అదే రోజున బ్రహ్మోత్సవాలకు అంకురార్పణ, పుణ్యాహవాచనము, ధ్వజారోహణము చేపట్టి స్వామి వారిని తిరిగి స్థానిక ఆలయానికి తీసుకుని వస్తారు. సాయంత్రం పుష్పపల్లకీలో స్వామి వారిని ఊరేగిస్తారు. 7న సింహవాహనం, 8న శేషవాహనము, 9న హనుమద్వాహనము, 10న గరుడవాహనము, 11న శ్వేతగజవాహనుముపై శ్రీవారు విహరిస్తారు. అనంతరం స్వామి వారి కల్యాణోత్సవము స్థానిక లక్ష్మీనారాయణస్వామి దేవాలయంలో నిర్వహిస్తారు. 12న సూర్య ప్రభ వాహనంపై , 13న అశ్వవాహనము, 14న హంస వాహనముపై విహరించనున్నారు. ఇంతటితో బ్రహ్మోత్సవాలు ముగిస్తాయి.





రథం (ఫైల్)

12న రథోత్సవం

బ్రహ్మోత్సవాలలో అత్యంత ప్రధాన ఘట్టమైన స్వామి వారి రథోత్సవం ఫిబ్రవరి12 జరుగనుంది. ఈ రథోత్సవానికి జిల్లా నలుమూలల నుంచే కాకుండా, కర్ణాటక నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో తరలివస్తారు. రథోత్సవం ప్రతి ఏటా మాఘ శుద్ధ పౌర్ణమి రోజున నిర్వహిస్తారు. ఉదయం 11-30 గంటలకు మడగు తేరు కార్యక్రమం నిర్వహిస్తారు. అనంతరం 4 గంటలకు ప్రధాన రథోత్సవం నిర్వహించనున్నట్లు ఆలయకమిటీ సభ్యులు, ఆలయ కమిటీ ఈఓ రమేష్‌బాబు తెలిపారు.

క్రైం కార్నర్

శవాన్ని బయటకు తీయండి

● హెచ్చెల్సీ డిస్ట్రిబ్యూటరీలో గుర్తు తెలియని మృతదేహం

బొమ్మనహాళ్, ఫిబ్రవరి 3(ఆంధ్రజ్యోతి): నీటిలో శవం తేలియాడుతోందని చెప్పినా పోలీసులు గానీ, లస్కర్లు గాని పట్టించుకోవడం లేదు. ఆ మృతదేహం కుళ్లి, పురుగులు పట్టి, కంపు కొడుతున్నా అధికారుల్లో మాత్రం చలనం లేదు. ఆ శవాన్ని బయటకు తీయాలని కోరినా స్పందించడం లేదు. ఇదీ మండలంలోని దేవగిరిక్రాస్ గ్రామ శివారు హెచ్చెల్సీ 1వ డిస్ట్రిబ్యూటరీ కాలువలో కనిపించిన గుర్తు తెలియని మృతదేహం కథ. కాలువలో గుర్తు తెలియని మృతదేహాన్ని గుర్తించిన స్థానిక రైతులు మూడురోజుల కిందటే పోలీసులకు, లస్కర్లకు సమాచారం ఇచ్చినా వారు పట్టించుకోలేదు. రెండురోజుల కిందట పోలీసులు వచ్చి మృతదేహాన్ని చూసి వెళ్లిపోయారు. హెచ్చెల్సీ ప్రధాన కాలువ నుంచి 1వ డిస్ట్రిబ్యూటరీ కాలువకు నీటి ప్రవాహం ఎక్కువగా ఉన్నందున మృతదేహం దేవగిరిక్రాస్ దేవగిరి గ్రామ శివారు వరకు కొట్టుకు వచ్చిందని గ్రామస్థులు పేర్కొన్నారు. మృతదేహంపై ఎలాంటి దుస్తులు లేవని కేవలం డ్రాయర్ మాత్రమే ఉందన్నారు. మృతి చెందిన వ్యక్తికి 30 నుంచి 35 సంవత్సరాలు వయస్సు ఉండవచ్చన్నారు. పోలీసులు స్పందించి మృతదేహాన్ని బయటకు తీయాలను స్థానిక రైతులు కోరుతున్నారు.

వివాహిత ఆత్మహత్య

రాయదుర్గంరూరల్, ఫిబ్రవరి 3(ఆంధ్రజ్యోతి): మండలంలోని టి. వీరాపురం గ్రామంలో జయంతి(20) అనే మహిళ సోమవారం ఉదయం ఆత్మహత్య చేసుకుంది. పోలీసులు, కుటుంబసభ్యులు తెలిపిన మేరకు గ్రామానికి చెందిన సుంకప్ప, నాగప్ప దంపతుల కుమార్తె జయంతికి నాలుగు నెలల కిందట కదరంపల్లి గ్రామానికి చెందిన చంద్రశేఖర్‌తో వివాహం చేశారు. గత కొద్దిరోజుల నుంచి ఆమె అనారోగ్య సమస్యలతో బాధపడుతుండేది. ఈనేపథ్యంలో ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరి వేసుకుంది. కుటుంబసభ్యులు గమనించి పోలీసులకు సమాచారం అందించారు. కేసు నమోదు చేసుకుని, మృతదేహాన్ని రాయదుర్గం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించినట్లు సీఐ జయనాయక్ తెలిపారు.

పెద్ద ఇల్లని చొరబడ్డారు.. వాచీలతో వెనుదిరిగారు..

● ఆదర్శనగర్‌లో చోరీ ● ఆలస్యంగా వెలుగులోకి..



ఇంట్లో చెల్లాచెదురుగా పడి ఉన్న వస్తువులు

అనంతపురం క్రైం, ఫిబ్రవరి3(ఆంధ్రజ్యోతి): త్రిబుల్ బెడ్ రూమ్‌తో కూడిన పెద్ద ఇల్లు. అది కూడా రిటైర్డ్ ఇంజనీర్‌ది కావడంతో దొంగలు పడ్డారు. ఆ ఇంట్లో బంగారు ఆభరణాలు, నగదు లేకపోవడంతో దొంగలు నిట్టూరుస్తూ వెనుదిరిగారు. దొరికిందే.. గొప్ప అన్నట్లు విలువైన వాచీలుంటే పట్టుకెళ్లారట. నగరంలోని ఆదర్శనగర్‌లో రిటైర్డ్ ఇంజనీర్ వెంకటప్ప ఇల్లు ఉంది. ఆయన మృతిచెందడంతో భార్య అశ్వత్థమ్మ నివాసం ఉంటున్నారు. ముగ్గురు కుమార్తెలు బెంగళూరులో సాఫ్ట్‌వేర్ ఇంజనీర్లుగా పనిచేస్తున్నారు. ఈ క్రమంలో అశ్వత్థమ్మ గత నెల 30న పుట్టపర్తికి వెళ్లారు. సోమవారం ఇంటికి వచ్చి చూడగా.. వస్తువులన్నీ చిందరవందరగా కనిపించాయి. సీసీటీవీ ఫుటేజీలో గతనెల 31న దొంగలు పడినట్లు తేలింది. ఇల్లు విశాలంగా ఉండటంతో దొంగలు బంగారు, డబ్బు ఉంటాయని అంచనా వేసి వచ్చినట్లు తెలుస్తోంది. ఈ ఘటనపై టూటౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశారు.

పదో తరగతి విద్యార్థి అదృశ్యం

అనంతపురం క్రైం, ఫిబ్రవరి 3(ఆంధ్రజ్యోతి): రూరల్ మండల పరిధిలోని పాములరాయిలో ఉన్న శ్రీ చైతన్య స్కూల్‌లో పదో తరగతి విద్యార్థి అదృశ్యమయ్యాడు. శ్రీసత్యసాయి జిల్లా లోని గోరంట్ల మండలం తాటిమాకులపల్లికి చెందిన కె. మనోజ్ పాములరాయిలో ఉన్న శ్రీ చైతన్య స్కూల్‌లో పదోతరగతి చదువుతున్నాడు. సోమవారం ఉదయం 9 గంటలకు స్కూల్ నుంచి అదృశ్యమయ్యాడు. ఈ ఘటనపై తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు అనంతపురం రూరల్ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఇంటి దొంగ

- పాఠశాల నుంచి బియ్యం, కోడిగుడ్ల తరలింపు
- ఫొటోలు తీసి పట్టుకున్న కమిటీ చైర్మన్
- హెల్పర్ తీరుపై నాయకుల ఆగ్రహం



కోడిగుడ్లు, బియ్యం తీసుకెళ్తున్న దృశ్యం

నంబులపూలకుంట, ఫిబ్రవరి 3(ఆంధ్రజ్యోతి): మధ్యాహ్న భోజన పథకం సరుకులను హెల్పర్ ఇంటికి తరలిస్తుండగా పట్టుబడ్డాడు. పాఠశాల కమిటీ చైర్మనే స్వయంగా ఫొటోలు తీసి ఇంటిదొంగ గుట్టురట్టు చేశాడు. నంబులపూలకుంటలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఆదివారం రాత్రి హెల్పర్ అమీన్‌పీరా కోడిగుడ్లు, బియ్యం, హార్లిక్ డబ్బాలను తీసుకెళుతుండగా.. పాఠశాల కమిటీ చైర్మన్ బాబీ సెల్‌లో చిత్రీకరించారు. అది సోమవారం సోషల్ మీడియాలో వైరల్ అయింది. ఈ ఘటనపై బాబీ విలేకరులతో మాట్లాడుతూ.. ఆదివారం సెలవు రోజు పాఠశాల తలుపులు తెరచి కోడిగుడ్లు, బియ్యం, హార్లిక్ డబ్బాలు తరలిస్తుండగా తన కంట పడ్డాడని వివరించారు. అప్పటికే కొన్ని బియ్యం బస్తాలు తరలించారని తెలిపారు. తాను అడిగితే పొంతన లేని సమాధానం చెప్పారని అన్నారు. దీనిపై సోమవారం వివిధ పార్టీల నాయకులు పాఠశాలకు చేరుకుని ఆరా తీశారు. ఎంఈఓలు సుబ్బిరెడ్డి, గోపాల్‌నాయక్, హెచ్‌ఎం శిరీషా, పాఠశాల కమిటీ చైర్మన్ బాబీ హెల్పర్ అమీన్‌పీరాను విచారించారు. కోడిగుడ్లను ఉడకపెట్టి పంపిణీ చేయడానికి, బియ్యాన్ని శుభ్రం చేయడానికి ఇంటికి తీసుకెళ్లినట్లు చెప్పాడు. హార్లిక్ డబ్బాలు ఎందుకు తీసుకెళ్లారని బీజేపీ నాయకులు ప్రశ్నించగా నీళ్లు నమిలాడు. ఘటనపై కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తామని బీజేపీ మండల అధ్యక్షుడు షేక్‌బాబ్జాన్ తెలిపారు. ఎంఈఓ సుబ్బిరెడ్డి మాట్లాడుతూ.. పాఠశాలలో జరిగిన విషయం డీఈఓ దృష్టికి వెళ్లిందన్నారు. ఘటనపై హెచ్‌ఎం శిరీషా నుంచి రాత పూర్వకంగా వివరణ తీసుకున్నట్లు తెలిపారు.

సైకిల్ పురం

(5వ పేజీ తరువాయి)

14 మంది మాత్రమే ఓటింగ్‌కు హాజరయ్యారు. టీడీపీ అభ్యర్థి విజయం సాధించారని ఎన్నికల అధికారి, ఆర్డీఓ ఆనంద్‌కుమార్ ప్రకటించారు. వైసీపీ తరపున 3వ వార్డు కౌన్సిలర్ లక్ష్మి పోటీలో నిలిచారు. రమేష్ చేత ఎన్నికల అధికారి ప్రమాణం చేయించి, డిక్లరేషన్ ఫారాన్ని అందజేశారు.

కౌన్సిల్ హాల్‌లోకి మొదట వైసీపీ సభ్యులు చేరుకున్నారు. టీడీపీ కౌన్సిలర్లతో కలిసి ఎమ్మెల్యే బాలకృష్ణ బస్సులో మున్సిపల్ కార్యాలయానికి వచ్చారు. ఎన్నిక ముగిసేవరకు జై బాలయ్య నినాదాలతో కౌన్సిల్ హాల్ హోరెత్తింది. చైర్మన్‌గా ఎన్నికైన రమేష్‌కు ఎమ్మెల్యే బాలకృష్ణ, ఎంపీ బీకే పార్థసారథి అభినందనలు తెలిపారు. టీడీపీ నాయకులు, కార్యకర్తలు గజమాలతో బాలయ్యను సత్కరించారు. మున్సిపల్ కార్యాలయం నుంచి 200 మీటర్ల దూరం వరకు ఎమ్మెల్యే వాహనంపై కార్యకర్తలు పూల వర్షం కురిపించారు.

భారీ బందోబస్తు

మున్సిపల్ చైర్మన్ ఎన్నికను రెండు పార్టీలు ప్రతిష్ఠాత్మకంగా తీసుకోవడంతో ఎస్పీ రత్న ఆధ్వర్యంలో భారీ బందోబస్తు ఏర్పాటు చేయించారు. నలుగురు డీఎస్పీలు, 15 మంది సీఐలు, 30 మంది ఎస్ఐలు, 200 మంది సిబ్బంది, రోప్ పార్టీ, స్పెషల్ పార్టీ పోలీసులు, వజ్ర వాహనాన్ని పురంలో మోహరించారు. మున్సిపల్ కార్యాలయానికి వంద మీటర్ల పరిధిలో గుంపులు కట్టకుండా చూశారు.



రోడ్డుపై బైఠాయించిన వైసీపీ నాయకులు



ఓటు వేయడానికి కౌన్సిలర్లతో కలిసి బస్సులో వెళ్తున్న ఎమ్మెల్యే బాలకృష్ణ

వైసీపీ నేతల వాగ్వాదం

వైసీపీ అభ్యర్థి తరపున మున్సిపల్ కార్యాలయంలోకి వెళ్లేందుకు ఆ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి దీపిక, ఆమె భర్త వేణురెడ్డి, ఎమ్మెల్సీ మంగమ్మ, ఇతర వైసీపీ నాయకులు ప్రయత్నించారు. వైసీపీ కార్యాలయం నుంచి ర్యాలీగా మున్సిపల్ కార్యాలయానికి వెళ్లాలని భావించారు. ఆ సమయంలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు ఎంజీఎం మైదానంలో ఉన్నారు. ఇరువర్గాలు ఒక్కచోట చేరితే శాంతి భద్రతలకు విఘాతం కలుగుతుందని భావించి, సీఐలు ఆంజినేయులు, జనార్దన్, ఎస్ఐ శ్రీధర్ సిబ్బంది వెళ్లి వైసీపీవారిని అడ్డుకున్నారు. దీంతో వైసీపీ నాయకుడు వేణురెడ్డి పోలీసులపై విరుచుకుపడ్డారు. అధికారం ఉందని అడ్డుకుంటే ప్రైవేటు కేసులు వేస్తామని బెదిరించారు. సీఐ ఆంజినేయులుతో వాగ్వాదానికి దిగారు. దీంతో తనకు కేసులు కొత్త కాదని, శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే చూస్తూ ఊరుకోబోమని సీఐ హెచ్చరించారు. హిందూపురంలో 144 సెక్షన్, 30 పోలీస్ యాక్ట్ అమలులో ఉందని గుర్తు చేశారు. అతిక్రమిస్తే చర్యలు ఉంటాయని హెచ్చరించారు. దీంతో వైసీపీ కార్యాలయం సమీపంలో నాయకులు, కార్యకర్తలు రోడ్డుపై బైఠాయించి నిరసన తెలిపారు. వైసీపీలో గెలిచిన కౌన్సిలర్లు టీడీపీకి మద్దతు తెలపడం సిగ్గుచేటని విమర్శించారు. కార్యక్రమంలో టీడీపీ జిల్లా అధ్యక్షుడు కొల్లకుంట అంజినప్ప, వాల్మీకి కార్పొరేషన్ డైరెక్టర్ ఆనంద్, సీనియర్ నాయకులు నాగరాజు, అనిల్, నెట్టప్ప, వెంకటేశులు, అమరనాథ్, బాచీ, మంజునాథ్ తదితరులు పాల్గొన్నారు.

బడ్జెట్‌లో రైల్వేకు అదనపు నిధులు

● డీఆర్ఎం చంద్రశేఖర్ గుప్తా



సమావేశంలో మాట్లాడుతున్న డీఆర్ఎం చంద్రశేఖర్ గుప్తా

గుంతకల్లు, ఫిబ్రవరి 3(ఆంధ్రజ్యోతి): పార్లమెంటులో ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో గత సంవత్సరం కంటే ఎక్కువ నిధులు రానున్నాయని డీఆర్ఎం చంద్రశేఖర్ గుప్తా పేర్కొన్నారు. బడ్జెట్‌లో రైల్వేలకు కేటాయింపులపై దక్షిణ మధ్య రైల్వే, సౌత్ కోస్ట్ రైల్వేల జీఎంలు, తెలుగు రాష్ట్రాల్లోని రైల్వే డివిజన్ల డీఆర్ఎంలతో రైల్వే శాఖ మంత్రి అశ్విన్ వైష్ణవ్ వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా రైల్వే మంత్రి మాట్లాడుతూ తెలుగు రాష్ట్రాలకు గత సంవత్సరం బడ్జెట్‌లో రూ. 9,151 కోట్ల నిధులు లభిస్తే ఈ సంవత్సరం రూ. 9,417 కోట్ల నిధులు దక్కాయని తెలిపారు. 2009 నుంచి ఐదేళ్ల కాలంలో కాంగ్రెస్ పాలనలో ఏపీకి సంవత్సరానికి సగటున రూ. 886 కోట్ల నిధులు లభించాయని, ఎన్డీయే-3 హయాంలో 2025-26 ఆర్థిక సంవత్సరానికి రూ. 9,417 కోట్లు వచ్చాయన్నారు. అప్పటితో పోలిస్తే 10 రెట్ల అదనపు నిధులు లభించాయన్నారు. వీడియో కాన్ఫరెన్స్‌లో జీఎం అరుణ్ మాట్లాడుతూ.. ఈ బడ్జెట్‌లో రైల్వేకు తెలుగు రాష్ట్రాలకు నిధులు ఏయే ప్రాజెక్టులకు ఏమేరకు లభించాయో, కొత్త ప్రాజెక్టుల పరిస్థితి, కొత్త రైళ్ల కేటాయింపు వివరాలపై త్వరలో పింక్‌బుక్ విడుదల చేస్తామని వివరించారు. గుంతకల్లు రైల్వే డివిజన్‌కు గతంలో లభించిన అమృత్ స్టేషన్లకు, కడప-బెంగళూరు, గుంతకల్లు-గుంటూరు డబ్లింగ్, గుత్తి-పెండేకల్లు డబ్లింగ్, నడికుడి-శ్రీకాళహస్తి డబ్లింగ్ లైన్లకు నిధుల పెద్ద మొత్తాల్లో లభించే అవకాశముందని రైల్వే అధికారులు అభిప్రాయపడ్డారు. డివిజన్ నుంచి వీడియో కాన్ఫరెన్స్‌లో డీఆర్ఎం చంద్రశేఖర్ గుప్తా, ఏడీఆర్ఎం సుధాకర్, సబార్డినేట్ అధికారులు పాల్గొన్నారు.

వందేళ్లలో రైల్వే అభివృద్ధి అమోఘం

దేశంలో విద్యుత్ రైళ్ల ఆవిష్కరణ తర్వాత వందేళ్లలో రైల్వేలు శరవేగంతో అభివృద్ధిని సాధించాయని డీఆర్ఎం చంద్రశేఖర్ గుప్త పేర్కొన్నారు. దేశంలో విద్యుత్ రైళ్ల ప్రారంభమై వందేళ్లు పూర్తయిన సందర్భంగా సోమవారం ఉదయం వాకథాన్ నిర్వహించారు. స్థానిక డీఆర్ఎం కార్యాలయం నుంచి రైల్వే అధికారులు, సిబ్బంది పాదయాత్రగా బయలుదేరి రైల్వే స్టేషన్‌కు చేరుకున్నారు. ఈ సందర్భంగా డీఆర్ఎం మాట్లాడుతూ.. విద్యుత్ రైళ్ల ఆవిష్కరణ తర్వాత రైల్వేలు దేశంలో బలీయమైన ఆర్థిక శక్తిగా మారాయన్నారు. దేశ ఆర్థిక వ్యవస్థకు వెన్నెముకగా మారేంతగా రైల్వేల ప్రాముఖ్యత పెరిగిపోయిందన్నారు. అనంతరం రైల్వే స్టేషన్ వద్ద ఏర్పాటుచేసిన విద్యుదీకరణకు సంబంధించిన చిత్రాల ఎగ్జిబిషన్‌ను డీఆర్ఎం ప్రారంభించారు. కార్యక్రమంలో ఏడీఆర్ఎం సుధాకర్, సీనియర్ డీఈఈ సుదర్శన్, సీనియర్ డీఎంఈ మంగాచార్యులు, సీనియర్ డీపీఓ క్యాపిల్ అరోరా తదితరులు పాల్గొన్నారు.

ఒక్కటీ రాలేదు..!

● గీత కార్మికులకు 14 మద్యం దుకాణాలు
● రెండు రోజులే గడువు.. ఒక్క దరఖాస్తూ రాలేదు
● ఈడిగలు తప్ప.. ఉప కులాలు లేవంటున్న నాయకులు

అనంతపురం అర్బన్, ఫిబ్రవరి 3(ఆంధ్రజ్యోతి): కల్లుగీత కార్మికులకు కేటాయించిన మద్యం దుకాణాలకు ఒక్క దరఖాస్తు కూడా రాలేదు. మద్యం షాపుల్లో 10 శాతం రిజర్వేషన్, లైసెన్స్ ఫీజులో 50 శాతం రాయితీని రాష్ట్ర ప్రభుత్వం కల్పించింది. దరఖాస్తుదారులు రూ.2 లక్షల నాన్ రిఫండబుల్ ఫీజు చెల్లించాలని నిబంధన పెట్టింది. జనవరి 27 నుంచి దరఖాస్తుల స్వీకరణ మొదలైంది. ఈ నెల 5వ తేదీ సాయంత్రం 5 గంటల వరకు సమయం ఇచ్చింది. 7వ తేదీన కలెక్టరేట్‌లో లాటరీ తీయాలని నిర్ణయించారు. 2016 స్మార్ట్ పల్స్ సర్వే ఆధారంగా జిల్లాలో ఈడిగ, గౌడ్, గౌడ, గౌండ్ల, కళాలి కులాలకు 14 మద్యం షాపులను కేటాయించారు. ఎక్సైజ్ అధికారులు గీత కార్మికులకు దరఖాస్తు విధానంపై అవగాహన కల్పించారు. జిల్లాతోపాటు రాయలసీమలో కేవలం ఈడిగ కులస్థులం ఉన్నామని, ఉపకులాలు లేవని ఎక్సైజ్ శాఖ ఉన్నతాధికారుల దృష్టికి ఈడిగ కులస్థులు తీసుకెళ్లారని సమాచారం. అయితే జీవో ఆధారంగా ఉప కులాలకు కలెక్టర్ ఆధ్వర్యంలో మద్యం దుకాణాలను కేటాయించారని అధికారులు చెప్పినట్లు తెలిసింది. సమగ్ర వివరాలు ఇవ్వాలని ఈడిగ సంక్షేమ సంఘం నాయకులు కోరినా, తమ వద్ద ఆ వివరాలు లేవని, నేరుగా ప్రభుత్వమే జీవో జారీ చేసిందని ఉన్నతాధికారులు చెప్పినట్లు సమాచారం. జీవో జారీకి ముందు స్థానిక సంఘాల నాయకులతో చర్చించి ఉంటే ఈ సమస్య తలెత్తేది కాదన్న వాదనలు వినిపిస్తున్నాయి. గత నెలలోనే జీవో జారీ చేయడంతో ఇప్పుడేమీ చేయలేని పరిస్థితి నెలకొంది.

సీమలో ఈడిగలు మాత్రమే ఉన్నారు



పది శాతం దుకాణాలను కల్లుగీత కార్మికులకు కేటాయించిన సీఎం చంద్రబాబుకు ధన్యవాదాలు. రాయలసీమలో ఈడిగ కులస్థులు మాత్రమే ఉన్నారు. గౌడ్, గౌడ, గౌండ్ల, కళాలివారు లేరు. పేరుకు మమ్మల్ని గౌడ్ అని పిలిచానా బీసీ-బి ఈడిగ అనే సర్టిఫికెట్ ఇస్తున్నారు. 2016 స్మార్ట్ పల్స్ సర్వే ఆధారంగా జిల్లాలో ఈడిగతోపాటు మిగతా కులాలున్నట్లు ఎక్సైజ్ అధికారులు చెబుతున్నారు. దీనిపై ప్రభుత్వం పునరాలోచించి రాయలసీమలో ఈడిగలకే మద్యం షాపులు కేటాయించాలి. కృష్ణా, గుంటూరు జిల్లాల్లో గౌడ్‌లు ఉన్నారు. గౌడలు ఏపీలో ఎక్కడా లేరు. కర్ణాటకలో ఉన్నారు. విశాఖపట్నంలో కళాలి కులస్థులు ఉన్నారు.

- మేకల వేణుగోపాల్ గౌడ్, ఈడిగ సంక్షేమ సంఘం నగర అధ్యక్షుడు.

నవ్విపోదురుగాక..!

అక్రమ వసూళ్లపై వీడియోలు ఉన్నా చర్యలు ఏవీ?

● లోలోపల బేరం కుదిరిందా..?

● డీసీటీఓ సుబ్బరాయుడు అంశంపై అనుమానాలు

అనంతపురం క్రైం, ఫిబ్రవరి 3(ఆంధ్రజ్యోతి): పన్నుల శాఖలో వసూల్‌రాజా వీడియోలు బహిర్గతమైనా చర్యలు చేపట్టకపోవడంపై సర్వత్రా విమర్శలు వ్యక్తం అవుతున్నాయి. లోలోపల ఏదో మతలబు జరిగే ఉంటుందనే సందేహాలు తలెత్తుతున్నాయి. బేరసారాలు ఏమైనా జరిగాయా అనే అనుమానాలు కలుగుతున్నాయి. అనంతపురం సర్కిల్-2లో పనిచేస్తున్న డీసీటీఓ సుబ్బరాయుడు సంక్రాంతి పండుగ సమయంలో హైవేలపై వసూళ్లకు తెగబడ్డారు. తన కుమారుడిని వెంటబెట్టుకొని వాహనదారుల నుంచి అక్రమంగా డబ్బులు వసూలు చేశాడు. మూడు రోజుల అనంతరం ఆయనను నిలదీస్తున్న వీడియో బయటకొచ్చింది. రాత్రి సమయంలో నల్లబండల వాహనాన్ని ఆపి డబ్బు వసూలు చేయడంతో వారు ఆయనను నిలదీశారు. పన్నుల శాఖలో మీది ఏ కేడర్ అని, మీరు వాడుతున్న వాహనం డిపార్ట్‌మెంట్‌దేనా..? మీరు మద్యం తాగి కూడా ఇలా వసూలు చేస్తుంటారా అని ప్రశ్నించారు. కర్నూలు జిల్లా డోన్‌లో జరిగిన ఈ ఘటనకు సంబంధించిన వీడియో సోషల్ మీడియాలో బాగా వైరల్ అయ్యింది. ఈ వీడియో బయటికి వచ్చి రెండు వారాలవుతున్నా డీసీటీఓపై ఆ శాఖాధికారులు ఎలాంటి చర్యలు చేపట్టకపోవడం విస్తుగొల్పుతోంది. డీసీటీఓపై చర్యలు తీసుకోకుండా ఉండటానికి బేరసారాలు జరిగాయనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఆయనపై విచారణ జరిపి నివేదిక ఇవ్వమని సీటీఓ-2 నరసింహులుకు అప్పగించారు. డీసీటీఓ వసూళ్లు చేస్తున్న సమయంలో తాత్కాలిక నెంబరున్న కొత్త కారు ఉపయోగించారు. ఆ కారు వివరాలు తెలుసుకుంటున్నామంటూ సీటీఓ-2 చెబుతున్నారు. ఈయన వసూళ్లపై ఆరా తీయకుండా కారు గురించి ఎందుకు ఆరా తీస్తున్నారో అర్థం కావడం లేదు. మరోవైపు డీసీటీఓ సుబ్బరాయుడు రోజూ ఆఫీస్‌కు రావడం చూసిన అధికారులు, సిబ్బంది ముక్కున వేలేసుకుంటున్నారట.

పక్క జిల్లాలో ఏం పని..?



డీసీటీఓ సుబ్బరాయుడు, ఆయన కుమారుడిని నిలదీస్తున్న వాహనదారుడు (ఫైల్)

డీసీటీఓ సుబ్బరాయుడు నిబంధనలకు విరుద్ధంగా వాహనాలు తనిఖీ చేసి డబ్బు వసూలు చేయడం తీవ్ర విమర్శలకు తావిచ్చింది. జిల్లాలో ఎక్కడైనా లారీ తనిఖీ చేయాలంటే జిల్లా స్థాయి ఉన్నతాధికారైన జాయింట్ కమిషనర్(జేసీ) అనుమతి ఉండాలి. కానీ డీసీటీఓ జిల్లా పరిధి దాటి కర్నూలు జిల్లా డోన్‌లో వసూలు చేశారు. అలా తనిఖీ చేయాలంటే ఆ శాఖ రాష్ట్ర కమిషనర్ అనుమతి ఉండాలి. ఇంత విరుద్ధంగా వసూలు చేయడం, ఆ వీడియో బయటకు వచ్చినా ఆయనపై చర్యలు లేకపోవడం ఆశ్చర్యం కలిగిస్తోంది. పైగా సంబంధిత డీసీటీఓ ఆ శాఖకు ఆదాయం తీసుకొచ్చే పని ఎప్పుడూ చేయలేదట. మరి ఇలాంటి అధికారిపై చర్యలు తీసుకోవడానికి ఎందుకు ఆలోచిస్తున్నారో ఆ అధికారులకే తెలియాలి. కారు ఏ ప్రాంతానిది, యజమాని ఎవరు..?, అది జరిగిన ప్రాంతం ఎక్కడిది..? లాంటి కోణాల్లో విచారణ చేస్తూ అసలు విషయాన్ని మరుగున పెట్టేయాలని చూస్తున్నారనే విమర్శలున్నాయి. ఇందుకు ముడుపుల వ్యవహారం నడిచిందనే ఆరోపణలున్నాయి. నివేదిక ఇచ్చే విషయంలో అలస్యం కావడంపైనా విమర్శలు వెల్లువెత్తాయి. కాగా మూడు రోజుల కిందట ఉన్నతాధికారులకు నివేదిక పంపినట్లు సీటీఓ నరసింహులు చెబుతున్నారు. ఆ నివేదికలో ఏముందో...ఉన్నతాధికారులు ఎలా స్పందిస్తారో వేచి చూడాల్సిందే.

న్యూస్ బాక్స్

నేడు సామూహిక సూర్య నమస్కారాలు

అనంతపురం కల్చరల్, ఫిబ్రవరి 3(ఆంధ్రజ్యోతి) : రథసప్తమి ని పురస్కరించుకుని స్థానిక వివేకానంద యోగా కేంద్రం ఆధ్వర్యంలో మంగళవారం ఉదయం 6 గంటలకు ఆర్ట్స్ కళాశాల బాస్కెట్‌బాల్ గ్రౌండ్‌లో సామూహిక సూర్యనమస్కారాలు నిర్వహించనున్నారు. ఈ మేరకు యోగా కేంద్రం జిల్లా అధ్యక్షుడు రాజశేఖర్‌రెడ్డి సోమవారం ఓ ప్రకటనలో వెల్లడించారు. ఈ సందర్భంగా ప్రత్యక్ష దైవమైన సూర్యభగవానుడిని ఆరాధిస్తూ 108 పర్యాయాలు 12 రకాల ఆసనాలతో సూర్యనమస్కారాలు చేయన్నుట్లు తెలిపారు. కాబట్టి యోగా అభ్యాసకులంతా పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

నగర కమిషనర్‌గా బాలస్వామి

అనంతపురం క్రైం, ఫిబ్రవరి 3(ఆంధ్రజ్యోతి): నగరపాలక సంస్థ కమిషనర్‌గా బాలస్వామిని నియమించారు. ఏలూరు కార్పొరేషన్ సెక్రటరీగా విధులు నిర్వర్తిస్తున్న బాలస్వామిని ఇక్కడికి నియమించారు. రెగ్యులర్ కమిషనర్‌గా ఉన్న నాగరాజు దీర్ఘకాలిక సెలవులోకి వెళ్లిన విషయం తెలిసిందే. ప్రస్తుతం ఇన్‌చార్జ్ కమిషనర్‌గా ప్రభుత్వాసుపత్రి అడ్మినిస్ట్రేటర్ మల్లికార్జున రెడ్డి కొనసాగుతున్నారు.

తప్పెట్లతో తరలిరండి : ఎమ్మార్పీఎస్

అనంతపురం రూరల్/ చెన్నేకొత్తపల్లి/ రామగిరి, ఫిబ్రవరి 3(ఆంధ్రజ్యోతి): ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపకులు మందకృష్ణ మాదిగ ఆధ్వర్యంలో ఈనెల 7న హైదరాబాద్‌లో జరిగే 'లక్షల డప్పులు- వేల గొంతులు' కార్యక్రమానికి తప్పెట్లతో తరలి రావాలని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర నాయకుడు బీసీఆర్ దాస్ పేర్కొన్నారు. ఆమేరకు కార్యక్రమం గురించి సోమవారం కురగుంటలో తప్పెట్లతో ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో దళిత నాయకులు పాల్గొన్నారు. హైదరాబాద్‌లో శుక్రవారం తలపెట్టిన లక్షల డప్పులు..వేల గొంతులు కార్యక్రమానికి తరలిరావాలని ఎమ్మార్పీఎస్ నాయకులు పిలుపునిచ్చారు. ఈ మేరకు సోమవారం చెన్నేకొత్తపల్లిలో పోస్టర్లను విడుదల చేశారు. లక్షల డప్పులు వేల గొంతులు కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్లను రామగిరిలో సోమవారం ఎమ్మార్పీఎస్ నాయకులు విడుదల చేశారు.

బాధిత రైతును ఆదుకోవాలి

అనంతపురం రూరల్, ఫిబ్రవరి 3(ఆంధ్రజ్యోతి): అగ్ని ప్రమాదంలో పంట దెబ్బతిని నష్టపోయిన రైతును ఆదుకోవాలని టీడీపీ మండల నాయకులు పేర్కొన్నారు. ఆ మేరకు మాజీ జడ్పీటీసీ వేణుగోపాల్, మండల ప్రధాన కార్యదర్శి పాముదాయి రఘు, రైతు మాధవయ్యతో కలసి సోమవారం తసీల్దార్ మోహన్ కుమార్‌కు వినతి పత్రం ఇచ్చారు. మండలంలోని ఇటుకపల్లికి చెందినమాధవయ్య ఏడేళ్లుగా చీనీ సాగు చేస్తున్నార న్నారు. దాదాపు 800చెట్లు ఉన్నాయన్నారు. ఆదివారం అగ్నిప్రమాదంలో దాదాపు 150కి పైగా చెట్లు కాలిపోయాయన్నారు. ఆ రైతుకు న్యాయం జరిగేలా చూడాలని కోరారు. టీడీపీ నాయకులు గోవిందు, చిరంజీవి తదితరులు పాల్గొన్నారు.

కందుల కొనుగోలు కేంద్రం ప్రారంభం

శింగనమల, ఫిబ్రవరి 3(ఆంధ్రజ్యోతి): నియోజకవర్గం కేంద్రంలో ప్రభుత్వ కందులు కొనుగోలు కేంద్రాన్ని సోమవారం ప్రారంభించినట్లు ఏఓ అన్వేష్ కూమార్ తెలిపా రు. రైతు సేవా కేంద్రాల ద్వారా 122 మంది రైతులు 955 క్వింటాళ్ల విక్రయానికి రిజిస్ట్రేషన్ చేసుకున్నారని తెలిపారు. క్వింటా రూ.7550 ప్రకారం మార్క్‌ఫెడ్ అధికారులు కొనుగోలు చేస్తారని తెలిపారు.

చౌక డిపోల్లో విజిలెన్స్ తనిఖీలు

అనంతపురం న్యూటౌన్, ఫిబ్రవరి 3(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి జిల్లాలోని పలు చౌక డిపోల్లో సోమవారం విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు ఆకస్మిక తనిఖీలు చేపట్టారు. సీఐ జమాల్ బాషా ఆధ్వర్యంలో పరిగి మండలంలోని నరసాపురం గ్రామంలోని ఉమాదేవికి చెందిన చౌకడిపోను తనిఖీ చేశారు. భౌతిక నిల్వలకు, రికార్డులను పరిశీలించి, ఎక్కువ వ్యత్యా సాలు ఉన్నట్లు గుర్తించామని సీఐ జమాల్‌బాషా తెలిపారు. భౌతిక నిల్వలను జప్తు చేసి స్థానిక రెవెన్యూ అధికారులకు అప్పగించినట్లు తెలిపారు. ఈ తనిఖీల్లో డీసీటీఓ సురేష్‌కుమార్, డిప్యూటీ తహసీల్దార్ హనుమంతు, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

గోకులం షెడ్లు పాడి రైతులకు వరం

రాప్తాడు, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): పాడి రైతుల సంక్షేమం కోసం కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ప్రవేశపెట్టిన గోకులం షెడ్లు పాడి రైతులకు వరం అని మండల ఇన్‌చార్జ్ దర్మవరపు మురళి, ఎంపీడీఓ విజయలక్ష్మి తెలిపారు. రాప్తాడులో రైతులు తలారి రామకృష్ణ, దండు సుజాత, గెంజి పుల్లన్న, తులసిలు నూతనంగా నిర్మించిన గోకులం షెడ్లను సోమవారం ప్రారంభించారు. ఎంపీడీ ఓ విజయలక్ష్మి, తహసీల్దార్ విజయకుమారి, ఏపిఓ సావిత్రి, కన్వీనర్ కొండప్ప, సర్పంచ్ తిరుపాలు, మాజీ కన్వీనర్ నారాయణస్వామి తదితరులు పాల్గొన్నారు.

హంద్రీనీవా లైనింగ్ పనులు నిలిపివేయాలి : సీపీఐ

బుక్కరాయసముద్రం, ఫిబ్రవరి 3(ఆంధ్రజ్యోతి): జిల్లాలో హంద్రీనీవా లైనింగ్ కాలువ నిర్మాణపు పనులు నిలిపివేయాలని సీపీఐ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి సీ మల్లిఖార్జున డిమాండ్ చేశారు. సోమవారం మండల కేంద్రంలోని స్థానిక వాల్మీకి దేవాలయంలో సీపీఐ రైతు సంఘం నియోజకవర్గ సమావేశం నిర్వహించారు. ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. ఈ సందర్భంగా జిల్లా కౌలు రైతు సంఘం వర్కింగ్ ప్రెసిడెంట్‌గా రాము, అధ్యక్షుడిగా బండారు రామాంజి, మండల కార్యదర్శిగా వెంకట్రాముడు, అధ్యక్షుడిగా సాకే భాస్కర్, సహాయ కార్యదర్శి భాస్కర్ తదితరులను ఎన్నుకున్నారు.

దాడిపై డీఐజీకి ఫిర్యాదు

అనంతపురం క్రైం, ఫిబ్రవరి 3(ఆంధ్రజ్యోతి): తన కుటుంబ సభ్యులపై దాడి చేసినా పోలీసులు పట్టించుకోలేదని నగరానికి చెందిన సాకే రామాంజినేయులు అనే వ్యక్తి డీఐజీ షిమోసికి ఫిర్యాదు చేశారు. ఆయన సోమవారం ఎరుకుల సంఘం నాయకులతో డీఐజీని కలిసి వినతిపత్రం అందజేశారు. అశోక్‌నగర్‌లో తాము నివాసముంటున్నామని, తాగునీటి కోసం నీటి కుళాయి వద్దకు వచ్చినప్పుడు తమను కులం పేరుతో దూషించారని తెలిపారు. తమ వదిన లక్ష్మీదేవి, తన భార్య రమాదేవిపై సాహెబి, కొండారెడ్డి, సుధీర్‌రెడ్డి, అనూష దాడి చేశారని ఆరోపించారు. ఈ దాడిలో తమ వదిన, భార్యకు గాయాలయ్యాయని, వన్‌టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదన్నారు. తమపై దాడిచేసిన వారిపై చర్యలు తీసుకోవాలని కోరారు.

ఇరు వర్గాలపై కేసులు

నగరంలోని అశోక్‌నగర్‌లో జరిగిన గొడవపై వన్‌టౌన్ పోలీసులు ఇరువర్గాలపై కేసులు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు. ఈనెల 31 వతేదీన రెండు కుటుంబాల మధ్య గొడవ చోటుచేసుకుంది. ఈ క్రమంలో ఎరుకల లక్ష్మీదేవి ఫిర్యాదు మేరకు సాహెబీ, హైదర్‌బీ, సుశీల్, సుధీర్‌కుమార్‌రెడ్డి, మనోజ్‌పై కేసు నమోదు చేశారు. సాహెబీ చేసిన ఫిర్యాదు మేరకు రామాంజినేయులు, లక్ష్మీదేవి,కుళ్లాయమ్మ, రమాదేవి, త్రివేణిలపై కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

వివాహేతర సంబంధం వల్లే హత్య

అనంతపురం క్రైం, ఫిబ్రవరి 3(ఆంధ్రజ్యోతి): నగర శివారులోని చింతతోపులో ఎరుకల కాశెప్ప హత్య కేసుకు సంబంధించి వివాహేతర సంబంధమే కారణమున్నట్లు సమాచారం. ఈ కేసును అనంతపురం రూరల్ పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. మృతుడు రెండు వివాహాలు చేసుకున్నట్లు పోలీసుల విచారణలో తేలింది. వివాహేతర సంబంధం నేపథ్యంలోనే హత్య జరిగినట్లు పోలీసులు ప్రాథమిక నిర్ధారణకు వచ్చినట్లు తెలిసింది.

పల్లెల్లో అభివృద్ధి పరుగులు

ప్రజల్లో హర్షం



తలుపూరు తారు రోడ్డు నిర్మాణానికి కంకర పరిచిన దృశ్యం

ఆత్మకూరు, ఫిబ్రవరి 3(ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం ఏర్పడ్డాక పల్లెల్లో అభివృద్ధి పరుగులు పెడుతోందని గ్రామీణులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. సీసీ రోడ్లు, తారురోడ్లు, తాగునీటి సౌకర్య తదితర అభివృద్ధి పనులు శరవేగంగా జరుగుతున్నాయి. వైసీపీ గత ఐదేళ్ల పాలనలో అభివృద్ధి పూర్తిగా కుటుంటపడింది. డ్రైనేజీ లేకపోవడంతో వీధుల్లో మురుగునీరు ప్రవహించేదని, రోడ్లు సరిగా లేకపోవడంతో ఇబ్బందులు పడ్డామని పలు గ్రామాల ప్రజలు అంటున్నారు. ఇప్పుడు రోడ్ల నిర్మాణంతో ప్రశాంతంగా ఉందని హర్షం వ్యక్తం చేస్తున్నారు. మండలపరిధిలోని పలు గ్రామాల్లో రూ. 3కోట్లతో సిమెంటు రోడ్లు వేశారు. దీంతో పాటు తలుపూరు గ్రామానికి రూ. కోటితో తారురోడ్డు పనులు వేగంగా జరుగుతున్నాయి. అలాగే గొరిదిండ్ల, తోపుదుర్తి గ్రామాల్లో రెండు విద్యుత్ సబ్‌స్టేషన్ల పనులు జరుగుతున్నాయి. ఆత్మకూరు మేజర్ పంచాయతీలో ముందస్తుగా తాగునీటి సమస్య తలెత్తకుండా రూ. 30లక్షలతో రెండు బోర్లు వేసి, ఇంటింటా నీటి సరఫరాకు పైప్‌లైన్ చేశారు. గ్రామాల్లో మరిన్ని అభివృద్ధి పనులకు ప్రతిపాదనలు పంపారు. గత ఐదేళ్లలో వైసీసీ ప్రభుత్వం చేయలేని అభివృద్ధిని కూటమి ప్రభుత్వం ఏర్పడ్డాక ఎమ్మెల్యే పరిటాల సునీత ఆధ్వర్యంలో ఆర్నెల్లలోనే జరుగుతున్నాయిని గ్రామ ప్రజలు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

మాజీ ఎమ్మెల్లే సొంత ఊరిలోనూ...

మండల పరిధిలోని తన స్వగ్రామమైన తోపుదుర్తిలో గత ఐదేళ్లలో మాజీ ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి చేయలేని అభివృద్ధి పనులను ఎమ్మెల్యే పరిటాల సునీత ఆర్నెల్లలోనే చేయించారు. రూ. కోటితో విద్యుత్ సబ్‌స్టేషన్, రూ. 40 లక్షలతో సీసీరోడ్లు, రూ. 20 లక్షలతో గోకులం షెడ్లు, రూ. 15లక్షలతో తాగునీటి పైపులైను పనులు చేయించారు. వీటితో పాటు మరిన్ని అభివృద్ధి పనులకు ప్రతిపాదనలు పంపినట్లు అధికారులు తెలిపారు.



ఆత్మకూరు బ్యాంక్ కాలనీలో ఇంటింటా కొళాయి

ప్రజాప్రతినిధుల సహకారంతోనే క్రీడాభివృద్ధి

● శాప్ చైర్మన్ రవినాయుడు ● ఎమ్మెల్యేలతో భేటీ



ఎమ్మెల్యేలు దగ్గుపాటి ప్రసాద్, ఎంఎస్ రాజుతో సమావేశమైన రవినాయుడు

అనంతపురం క్లాక్‌టవర్, ఫిబ్రవరి 3(ఆంధ్రజ్యోతి): ప్రజాప్రతినిధుల సహకారంతోనే క్రీడాభివృద్ధి సాధ్యమవుతుందని ఏపీ రాష్ట్ర క్రీడాప్రాధికార సంస్థ(శాప్) చైర్మన్ అనిమిని రవినాయుడు పేర్కొన్నారు. ఆయన సోమ వారం ఉదయం అర్బన్ ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్, మడకశిర ఎమ్మెల్యే ఎంఎస్ రాజు, రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీతను వేర్వేరుగా కలిశారు. ఉమ్మడి జిల్లాలో క్రీడాభివృద్ధి, స్టేడియాల నిర్మాణంపై చర్చించారు. ఉమ్మడి జిల్లాలో అంతర్జాతీయ క్రీడాప్రమాణాలతో స్టేడియం నిర్మాణం, వసతుల కల్పనకు ప్రజాప్రతినిధుల సహకారం అవసరమన్నారు. సీఎం చంద్రబాబు ఆదేశాల మేరకు క్షేత్ర స్థాయిలో పర్యటిస్తున్నట్లు తెలిపారు. రాష్ట్రంలోని క్రీడాకారులందరికీ స్థానికంగా అత్యుత్తమ ప్రమాణాలతో క్రీడాసౌకర్యాలు కల్పిస్తామన్నారు. విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ సూచనల మేరకు నిధులను సమకూర్చి క్రీడాభివృద్ధికి చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు.

యోగాను క్రీడగా గుర్తించాలి

అనంతపురం కల్చరల్, ఫిబ్రవరి 3(ఆంధ్రజ్యోతి) : యోగాను పాఠశాల స్థాయి నుంచే క్రీడగా గుర్తించాలని యోగాసన స్పోర్ట్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు రాజశేఖర్‌రెడ్డి డిమాండ్ చేశారు. జిల్లా కేంద్రంలోని ఇండోర్ స్టేడియంలో సోమవారం ఏపీ స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ అనిమిని రవినాయుడును కలిసి వినతిపత్రం అందజేశారు. అసోసియేషన్ ప్రతినిధులు దివాకర్, గురరాజారావు, తారక రామయ్య తదితరులు పాల్గొన్నారు.

క్రీడా సమస్యలను వివరించిన ఎమ్మెల్యే పరిటాల సునీత



క్రీడాకారులతో పరిటాల సునీత, శాప్ చైర్మన్

రామగిరి, ఫిబ్రవరి 3(ఆంధ్రజ్యోతి):క్రీడాపరంగా నియోజకవర్గం లో ఉన్న సమస్యలను పరిష్కరించాలని ఎమ్మెల్యే పరిటాల సునీత శాప్‌చైర్మన్ రవినాయుడుకు సూచించారు. సోమవారం శాప్‌చైర్మన్ రవినాయుడు వెంకటాపురానికి చేరుకుని ముందుగా పరిటాల రవి ఘాట్ వద్ద నివాళులర్పించారు. అనంతరం ఆయన ఎమ్మెల్యే పరిటాలసునీతను మర్యాదపూర్వకంగా కలిసి... రామగిరి చెన్నేకొత్తపల్లి, కనగానపల్లి స్పోర్ట్స్ స్టేడియంల గురించి చర్చించారు. జూడో తదితర క్రీడాపోటీలలో రాణించిన మండలంలోని పాఠశాల విద్యార్థులను శాప్‌చైర్మన్ అభినందించారు.అనంతరం రామగిరిలోని పరిటాల రవీంద్ర మెమోరియల్ స్టేడియంను పరిశీలించారు. వైసీపీ ప్రభుత్వంలో దీనిని పూర్తి అధ్వానంగా మార్చేశారని టీడీపీ నాయకులు ఆయన దృష్టికి తెచ్చారు. దాని మరమ్మతులతో పాటు చెన్నేకొత్తపల్లి, కనగానపల్లి స్టేడియాల నిర్మాణానికి అంచనాలు సిద్ధం చేయాలని ఆయన అధికారులను ఆదేశించారు. ఆయన వెంట టీడీపీ నాయకులు రామ్మూర్తినాయుడు, ధర్మవరపు బాలాజీ, సుదాకర్, మారుతీప్రసాద్, శ్రీధర్‌నాయుడు తదితరులు పాల్గొన్నారు.

షెల్టర్‌హోమ్‌ను సందర్శించిన డీఎల్‌ఎస్‌ఏ కార్యదర్శి

అనంతపురం క్రైం, ఫిబ్రవరి 3(ఆంధ్రజ్యోతి): జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి శివప్రసాద్‌యాదవ్ సోమవారం కమలానగర్‌లోని షెల్టర్‌హోమ్‌ను సందర్శించారు. ఈ సందర్భంగా మహిళలు, వృద్ధుల ఆరోగ్య పరిస్థితి అడిగి తెలుసుకున్నారు. కనీస అవసరాలపై ఆరా తీశారు. సీనియర్ సిటిజన్ యాక్ట్-2007 గురించి వారికి తెలియజేశారు. పింఛన్, రేషన్, ఆధార్‌కార్డుల సమస్యలపై అడిగి తెలుసుకున్నారు.

పర్యావరణ విద్య పరీక్షకు 25,037 మంది హాజరు

అనంతపురం విద్య, ఫిబ్రవరి 3(ఆంధ్రజ్యోతి): పర్యావరణ విద్య పరీక్షలకు 25,037 మంది విద్యార్థులు హాజరైనట్లు జిల్లా పరీక్షల నిర్వహణ కమిటీ కన్వీనర్, డీవీఈఓ వెంకట రమణ నాయక్ తెలిపారు. సోమవారం జిల్లా వ్యాప్తంగా 146 జూనియర్ కళాశాలల్లో పర్యావరణ విద్య పరీక్షలు నిర్వహించామన్నారు. 25,798 మంది విద్యార్థులకు గాను 25,037 మంది హాజరుకాగా 761 మంది గైర్హాజరయ్యారన్నారు. కన్వీనర్ మూడు పరీక్షా కేంద్రాలను, డీఈసీ సభ్యులు నాలుగు, ప్రభుత్వ జూనియర్ లెక్చరర్లు 18 కేంద్రాలను తనిఖీ చేసినట్లు ఆయన పేర్కొన్నారు.

లఘుచిత్రోత్సవ విజేతలకు అవార్డుల ప్రదానం

అనంతపురం కల్చరల్, ఫిబ్రవరి 3(ఆంధ్రజ్యోతి): షార్ట్ ఫిల్మ్ సొసైటీ(అనంతపురం) ఆధ్వర్యంలో నిర్వ హించిన లఘుచిత్రోత్సవాల పోటీల్లో విజేతలుగా నిలిచినవారికి సోమవారం స్థానిక అనంత కన్వెన్షన్ హాల్‌లో అవార్డుల ప్రదానోత్సవం నిర్వహించారు. జనవరి 27 నుంచి నిర్వహిస్తున్న ఈ పోటీలు ఆదివారం ముగిశాయి. పోటీలకు 12 కథలు ఎంపిక కాగా వాటిలో 'పబ్లిక్ టాయ్‌లెట్ లేక మహిళలు పడుతున్న ఇబ్బందులపై జీఎంఎస్ గ్యాలరీ ఫిలిమ్స్ నిర్వాహకులు రూపొందించిన కథ మొదటి బహుమతికి ఎంపికైంది. జీఎంఎస్ గ్యాలరీ ఫిలిమ్స్ ప్రతినిధులకు రూ. 50వేలు బహుమతిని అందజేశారు. అలాగే పోటీల్లో పాల్గొన్న లఘుచిత్ర దర్శకులకు అవార్డులను అందజేసి సత్కరించారు. కార్యక్రమంలో ఎంవీ రఘు, వెంకటేశ్వరరావు, వెంకట్ కట్టా, సూర్యనారాయణ, జీఎస్ రెడ్డి, గోపాలకృష్ణ, ముడార్ సుధీర్, సాయి ట్రస్టు విజయసాయికుమార్, డిస్కవరీ అనంతపురం అనీల్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల బకాయిలు వెంటనే చెల్లించాలి: మేయర్

అనంతపురం క్రైం, ఫిబ్రవరి 3(ఆంధ్రజ్యోతి): ఫీజు రీయింబర్స్‌మెంట్ ఇవ్వకుండా విద్యార్థులను ఇబ్బంది పెట్టడం తగదని, వెంటనే బకాయిలు చెల్లించాలని నగర మేయర్ మహమ్మద్ వసీం డిమాండ్ చేశారు. సోమవారం మేయర్ ఛాంబర్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మేయర్ మాట్లాడారు. ఎన్నికల సమయంలో అనేక హామీలను ఇచ్చిన కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడు నెలలవుతున్నా నిర్లక్ష్యం వహిస్తున్నారన్నారు. వైసీపీ ఆధ్వర్యంలో బుధవారం చేపడుతున్న ఫీజు పోరును విజయవంతం చేయాలని కోరారు.

ఫీజు పోరుకు సిద్ధం : రమేష్ గౌడ్

వైసీపీ ఆధ్వర్యంలో విద్యార్థుల ఫీజు రీయింబర్స్‌మెంట్‌కు సంబంధించి బుధవారం చేపడుతున్న ఫీజు పోరుకు సిద్ధంగా ఉన్నామని వైసీపీ జిల్లా టాస్క్‌ఫోర్స్ సభ్యుడు రమేష్‌గౌడ్ తెలిపారు. వైసీపీ జిల్లా కార్యాలయంలో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో రమేష్‌గౌడ్ మాట్లాడారు. ఫీజు రీయింబర్స్‌మెంట్, వసతి దీవెన బకాయిలను విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ కలెక్టరేట్ వరకు ర్యాలీ నిర్వహిస్తున్నామన్నారు. కార్యక్రమంలో ఏఐఎస్‌టీ పృథ్వీ, పీఎస్ఐ నరేంద్ర, జీవీఎస్‌ఎస్ మల్లికార్జున నాయక్, లక్ష్మీపతి నాయక్ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వాల చర్యలతో కార్మికులకు ద్రోహం

● ఏఐటీయూసీ రాష్ట్ర అధ్యక్షుడు రవీంద్రనాథ్

అనంతపురం విద్య, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి) : కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు కార్మికులకు ద్రోహం చేస్తున్నాయంటూ... ఏఐటీయూసీ రాష్ట్ర అధ్యక్షులు రవీంద్రనాథ్ మండిపడ్డారు. ఆ సంఘం కార్యాలయంలో జిల్లా సమితి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... కేంద్రబడ్జెట్‌లో కార్మికులకు నయా పైసా కూడా కేటాయించలేదన్నారు. ఇప్పటికే 44 చట్టాలను నాలుగు లేబర్ కోడ్లుగా తీసుకొచ్చి కార్మికులకు తీరని ద్రోహం చేశారన్నారు. కూటమి ప్రభుత్వం సైతం ఈ ఎనిమిది నెలల్లో కార్మికులు, ఉద్యోగుల ఏ ఒక్క సమస్య కూడా పరిష్కరించలేద ని మండిపడ్డారు. కేంద్ర బడ్జెట్‌పై ఈ నెల 5న దేశవ్యాప్తంగా ఆందోళనలు చేపట్టనున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో ఆ సంఘం జిల్లా ప్రధానకార్యదర్శి రాజారెడ్డి, వర్కింగ్ ప్రెసిడెంట్ కృష్ణుడు, ఇతర నాయకులు గోవిందు, నాగమణి, శ్రీనివాసులు, చిరంజీవి, రాజు పాల్గొన్నారు.

మట్టి టిప్పర్ల అడ్డగింత

గార్లదిన్నె, ఫిబ్రవరి 3(ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలోని పాపినేపాళ్యం గ్రామంలో మట్టి టిప్పర్లను సోమవారం రాత్రి గ్రామస్థులు అడ్డుకున్నారు. గ్రామ సమీపంలో ఉన్న ఎర్రచెరువు నుంచి పదిరోజులుగా చెరువు మట్టిని టిప్పర్ల ద్వారా అనంతపురం, పామిడి వైపు అక్రమంగా తరలిస్తున్నారు. సోమవారం రాత్రి గ్రామస్థులు అడ్డుకున్నారు. టిప్పర్ల ద్వారా మట్టిని తరలిస్తుండడంతో పైపులైన్లు, గ్రామంలో రోడ్లు ధ్వంసమవు తున్నాయని గ్రామస్థులు వాపోతున్నారు. దుమ్ముధూలితో ఇబ్బందిగా మారిందన్నారు. చెరువు మట్టిని తరలించమని ఎవరు చెప్పారు...? అని టిప్పర్ల డ్రైవర్లను ప్రశ్నిస్తే పొంతన లేని సమాధానం చెబుతుండడంతో గ్రామస్థులు ఐక్యమత్యంతో సుమారు 10 టిప్పర్లను గ్రామంలోనే అడ్డుకున్నారు. విషయం తెలుసుకున్న పోలీసులు హుటాహుటిన అక్కడికి చేరుకుని విచారించారు. అనుమతులున్నట్లు తెలుసుకుని గ్రామస్థులకు సర్దిచెప్పారు. దీంతో ఆందోళన సద్దుమనిగింది. ఎర్రచెరువు నుంచి మట్టి తరలించడానికి జనవరి 28 నుంచి ఫిబ్రవరి 4వ తేదీ వరకు గడువు ఉందని ఇరిగేషన్ డీఈ రాజా తెలిపారు. మంగళవారంతో గడువు పూర్తి అవుతుందన్నారు. గడువు పూర్తి అయిన తరువాత మట్టిని తరలిస్తే వారిపై చర్యలు తీసుకుంటాం.

రోడ్డు వేసిన తరువాతే గ్రామంలోకి అడుగుపెట్టా

● నాగసముద్రం రోడ్డు ప్రారంభోత్సవంలో ఎమ్మెల్యే పరిటాల సునీత



శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే పరిటాల సునీత

చెన్నేకొత్తపల్లి, ఫిబ్రవరి 3(ఆంధ్రజ్యోతి): ఎన్నికల సమయంలో ఇచ్చిన మాట ప్రమారమే రోడ్డు వేయించిన తరువాతే ఈ రోజు మీ గ్రామంలోకి అడుగుపెట్టానని ఎమ్మెల్యే పరిటాల సునీత నాగసముద్రం గ్రామస్థులతో అన్నారు. మండలంలోని నాగసముద్రం గ్రామంలో ఏపీ ఆర్‌ఆర్‌పీ పథకం కింద రూ.1.41కోట్లతో నూతనంగా నిర్మించిన తారురోడ్డును ఎమ్మెల్యే సోమవారం ప్రారంభించారు. నూతనంగా నిర్మించిన రెండు కిలోమీటర్ల రోడ్డుపై గ్రామానికి చెందిన పలువురు మహిళలు రంగువల్లులు వేసి ఘనస్వాగతం పలికారు. ఎమ్మెల్యేను ఎడ్లబండిపై గ్రామంలో ఊరేగించారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ... గత వైసీపీ పాలనలో నియోజకవర్గంలో ఎక్కడా జానెడు రోడ్డు వేసిన చరిత్ర తోపుదుర్తికి లేదని టీడీపీ అధికారంలోకి వచ్చిన ఏడు నెలలోనే రాప్తాడు నియోజకవర్గంలో తారురోడ్లు, సీసీరోడ్లు వేయించామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పీఆర్ ఈఈ ప్రభాకరరెడ్డి, డీఈ రామచంద్రారెడ్డి, ఈఓఆర్‌డీ అశోక్ నాయక్, టీడీపీ సీనియర్‌నాయకుడు ఎల్‌నారాయణచౌదరి, బీసీసెల్ జిల్లా అధ్యక్షుడు రంగయ్య, రామ్మూర్తినాయుడు, టీడీపీ జిల్లా ఉపాధ్యక్షుడు దండు ఓబుళేశు, మాజీ ఎంపీపీ అంకేఅమరేంద్ర, ఈడిగ బార్గవగౌడ్ పాల్గొన్నారు.

నేడు చాపట్ల రోడ్డు ప్రారంభం

రాప్తాడు, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మరూరు జాతీయ రహదారి వద్ద నుంచి చాపట్ల గ్రామం వరకు నూతనంగా నిర్మించిన తారు రోడ్డును మంగళవారం ఎమ్మెల్యే పరిటాల సునీత, మండల ఇన్‌చార్జ్ దర్మవరపు మురళి ప్రారంభించనున్నట్లు మండల కన్వీనర్ కొండప్ప పత్రికా ప్రకటనలో తెలిపారు. సాయంత్రం 4 గంటలకు నిర్వహించే కార్యక్రమానికి టీడీపీ నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో హాజరుకావాలని కోరారు.



శంకరమఠంలో సామూహిక అక్షరాభ్యాసం నిర్వహిస్తున్న దృశ్యం

కన్నుల పండువగా వసంత పంచమి

అనంతపురం కల్చరల్, ఫిబ్రవరి 3(ఆంధ్రజ్యోతి): నగరంలోని పలు ప్రాంతాల్లో సోమవారం వసంత పంచమిని వేడుకలను కనుల పండువగా నిర్వహించారు. శారదానగర్‌లోని శంకర మఠంలో దాదాపు 200 మంది చిన్నారులకు సామూహిక అక్షరాభ్యాసం చేశారు. కార్యక్రమంలో మఠం కార్యనిర్వహణాధికారి సత్యప్రసాద్, మోహన్ తదితరులు పాల్గొన్నారు. అలాగే స్థానిక సరస్వతి విద్యామందిరంలో నిత్యసురభి చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో దాదాపు 60 మంది చిన్నారులకు అక్షరాభ్యాసం చేశారు. కార్యక్రమంలో ట్రస్టు చైర్‌పర్సన్ నిర్మలా మురళి, సాయి ట్రస్టు అధ్యక్షుడు విజయసాయికుమార్, బద్రీనాథ్, నరసింహులు, ఆళ్లగడ్డ రాము తదితరులు పాల్గొన్నారు.

అర్జీల పరిష్కారంలో అలసత్వం వద్దు : కలెక్టర్



బాధితుల నుంచి ఫిర్యాదులు తీసుకుంటున్న కలెక్టర్ వినోద్‌కుమార్

అనంతపురం టౌన్, ఫిబ్రవరి 3(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్న ప్రజాసమస్యల పరిష్కార వేదికకు వచ్చిన ప్రతి అర్జీకి సత్వర పరిష్కారం చూపాలని కలెక్టర్ వినోద్ కుమార్ అధికారులను ఆదేశించారు. ఏ శాఖలోను పెండింగ్ ఉండ కూడదన్నారు. కలెక్టరేట్‌లోని రెవెన్యూ భవన్‌లో సోమవారం ప్రజా సమస్యల పరిష్కారవేదిక కొనసాగింది. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి 418మంది తరలివచ్చి వారి సమస్యలను అర్జీల రూపంలో అందజేసి, విన్నవించారు. కలెక్టర్‌తో పాటు అసిస్టెంట్ కలెక్టర్ వినూత్న, డీఆర్ఓ మలోల, డిప్యూటీ కలెక్టర్లు తిప్పేనాయక్, ఆనంద్, శిరీష, వ్యవసాయశాఖ జేడీ ఉమామహేశ్వరమ్మ తదితరులు బాధితుల నుంచి అర్జీలు స్వీకరించారు. అనంతరం అధికారులతో కలెక్టర్ అర్జీల పరిష్కారంపై సమీక్షించారు.

కూటమి వచ్చాకే రోడ్లు బాగు

● ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్



రుద్రంపేట బ్యాంకుకాలనీలో సీసీరోడ్డు పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే

అనంతపురం రూరల్, ఫిబ్రవరి 3(ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం ఏర్పడిన తరువాత గ్రామీణ రోడ్లు బాగుపడ్డాయ ని ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ అన్నారు. మండలంలోని రుద్రంపేట పంచాయతీ బ్యాంకు కాలనీలో నూతనంగా నిర్విస్తున్న సీసీరోడ్లను ఆయన ఆయన సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా కాంట్రాక్టర్‌తో, స్థానిక నాయకులతో మాట్లాడారు. రోడ్లను నాణ్యంగా నిర్మించాలని సూచించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ... నియోజకవర్గంలో చాలా చోట్ల రోడ్ల సమస్యలు ఉన్నాయన్నారు. గత ప్రభుత్వంలో కొన్ని ప్రాంతాలను పూర్తిగా విస్మరించారని, అం దుకే ఎక్కడ రోడ్డు అవసరం ఉన్నా వెంటనే అంచనాలు పంపుతున్నామన్నారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వాస్పత్రి అభివృద్ధి కమిటీ సభ్యుడు గంగారామ్, టీడీపీ జిల్లా ఉపాధ్యక్షుడు డిష్ నాగరాజు, నగర ప్రధాన కార్యదర్శి ముక్తియార్, పంచాయతీ ఇన్‌చార్జ్ భక్తవత్సల నాయుడు, నాయకులు గోపాల్ గౌడ్, రామాంజినేయులు, కడియాల కొండన్న తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్యంపై వాతావరణ మార్పు ప్రభావం

● డీఎంహెచ్ఓ, స్వస్తి ప్రతినిధులు

అనంతపురం టౌన్, ఫిబ్రవరి 3ఆంధ్రజ్యోతి): వాతావరణ మార్పు మానవ ఆరోగ్యంపై తీవ్రప్రభావం చూపుతుందని, ప్రజలు జాగ్రత్తగా ఉంటేనే మేలు జరుగుతుందని డీఎంహెచ్ఓ డాక్టరు ఈబీ దేవి, స్వస్తి సంస్థ ప్రతినిధులు శంకర్, డానియల్ సూచించారు. జిల్లా వైద్యశాఖ కార్యాలయంలో సోమవారం వాతావరణమార్పుతో ఆరోగ్యంపై ప్రభావం అనే అంశంపై సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కరువు జిల్లా అనంతపై వాతావరణ మార్పులు అధికంగా ఉంటాయన్నారు. వేడివల్ల పెద్దలు, పిల్లలు, గర్భిణులపై ప్రభావం ఎక్కువగా ఉంటుందన్నారు. రాష్ట్రవైద్యశాఖ కమిషనర్, కలెక్టర్ ఆమోదంతో ఈ జిల్లాలో వాతావరణ మార్పులు, ఆరోగ్యంపై ప్రభావం గురించి జిల్లాలో ప్రజలకు అవగాహన కల్పించి అప్రమత్తం చేసేందుకు వైద్యసిబ్బందికి శిక్షణ ఇస్తామన్నారు. కార్యక్రమంలో ప్రోగ్రామ్ ఆఫీసర్ డాక్టరు నారాయణస్వామి, స్వస్తి ప్రతినిధులు డాక్టరు కేటీ, హన్నా వైన్ స్టెయిన్, డెమోలు త్యాగరాజు, గంగాధర్, మౌనిక తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి రుణాలకు దరఖాస్తు చేసుకోండి

కనగానపల్లి, ఫిబ్రవరి 3(ఆంధ్రజ్యోతి): స్వయం ఉపాది రుణాలకు కోసం వివిధ కార్పొరేషన్ల ద్వారా మంజూరైన యూనిట్లకోసం అసక్తి గల వారు దరఖాస్తు చేసుకోవాలని ఎంపీడీఓ అనీల్‌కుమార్ సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మండల వ్యాప్తంగా బీసీ, ఈబీసీ, తదితర కార్పరేషన్లకు సంబంధించి 46 యూనిట్లు మంజూరయ్యాయన్నారు. ఈ నెల 7 లోగా దరఖాస్తు చేసుకోవాలని ఆయన కోరారు.

ఆలస్యంగా విధులకు..!

● సమయపాలన పాటించని ఎస్సీ వెల్ఫేర్ సూపరింటెండెంట్



ఉదయం 11.45 గంటల సమయంలో ఖాళీగా ఉన్న సూపరింటెండెంట్ కుర్చీ

అనంతపురం ప్రెస్‌క్లబ్, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ శాఖల్లో విధులు నిర్వహించే అధికారులు, సిబ్బంది సమయపాలన పాటించా లని కలెక్టర్ స్పష్టమైన ఆదేశాలు జారీ చేస్తున్నారు. అయినప్పటికీ కొందరు అధికారులు తీవ్ర అలసత్వాన్ని వహిస్తున్నారు. ఇందుకు సాంఘిక సంక్షేమశాఖ కార్యాలయం నిదర్శనంగా నిలుస్తోంది. ఆ కార్యాలయాన్ని సోమవారం ఉదయం 11.45 గంటల సమయంలో ఆంధ్రజ్యోతి విజిట్ చేసింది. ఆ సమయంలో సూపరింటెండెంట్ వెంకటలక్ష్మి కార్యాలయంలో లేరు. ఆమె 'లీవులో వెళ్లారా..? ఏదైనా అత్యవసర పనిమీద పర్మిషన్ తీసుకున్నారా?' అని ఆ శాఖ ఉన్నతాధికారిని ఆరా తీయగా... అలాంటిదేమీ లేదని ఆయన తెలిపారు. తనకు ఎలాంటి సమాచారం ఇవ్వలేదని బదులిచ్చారు. ఆమె 12 గంటలకు విధులకు హాజరయ్యారు. నిబంధనల మేరకు 10.30కు రావాల్సి ఉన్నప్పటికీ... 12 గంటలకు రావడంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి. కాగా... ప్రతి సోమవారం స్పందన కార్యక్రమం ఉన్న నేపథ్యంలో... మధ్యాహ్నం 12 గంటలకు సూపరింటెండెంట్ విధులకు హాజరవుతున్నట్లు ఆ కార్యాలయ ఉద్యోగుల ద్వారా అందిన సమాచారం.

గుండెపోటుకు అందుబాటులో ఇంజక్షన్

గుత్తి, ఫిబ్రవరి 3(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ప్రభుత్వ ఆస్పత్రిలో గుండెనొప్పి చికిత్సకు సంబంధించిన విలువైన ఇంజక్షన్ అందుబాటులో ఉందని ఆస్పత్రి సూపరింటెండెంట్ ఎల్లప్ప సోమవారం తెలిపారు. గుండెనొప్పి వచ్చిన వారిని గంటలోపు ఆస్పత్రికి తీసుకొస్తే రూ.45విలువ చేసే టెన్సీటోప్లస్ ఇంజక్షన్ను వేస్తారన్నారు. ఈ ఇంజక్షన్ ఇవ్వడం వల్ల గుండెపోటును నుంచి ఉపశమనం కలుగుతుందన్నారు. ఇప్పటివరకు ఆస్పత్రిలోలో 26 మందికి ఈ ఇంజక్షన్ వేసినట్లు చెప్పారు.

ట్రాక్టర్ నుంచి దూకి ఒకరికి తీవ్రగాయాలు

గుత్తి, ఫిబ్రవరి 3(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని రైల్వే స్టేషన్ సమీపంలో గల రైల్వే బ్రిడ్జి వద్ద సోమవారం వెళుతున్న ట్రాక్టర్పై నుంచి దూకడంతో రవి అనే వ్యక్తి తీవ్రంగా గాయపడ్డాడు. రైల్వే స్టేషన్సమీపంలో ఓ బ్రిడ్జివద్దకు మట్టిని తీసుకెళ్తున్న ట్రాక్టర్ ఉన్నట్లుండి ఓ పక్కకు ఒరిగింది. కింద పడుతుందనే భయంతో బసినేపల్లికి చెందిన రవి అందులోంచి దూకి తీవ్రంగా గాయపడ్డాడు. అతడిని వెంటనే స్థానిక ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మెరుగైన చికిత్స కోసం అనంతపురం తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

కారును లారీ ఢీకొనడంతో మహిళకు..

గుత్తి, ఫిబ్రవరి 3(ఆంధ్రజ్యోతి):పట్టణంలోని కేంద్రీయ విద్యాలయం వద్ద సోమవారం ఉదయం కారును లారీ ఢీకొంది. మంత్రాలయం నుంచి బెంగళూరుకు వెళ్తున్న కారు పట్టణంలోని కేంద్రీయ విద్యాలయం వద్ద స్పీడ్ బ్రేకర్ ఉండటంతో స్లో అయింది. దీంతో వెనుకవైపు వేగంగా వస్తున్న కంటైనర్ లారీ ఢీకొంది. ప్రమాదంలో కారులో ఉన్న ఓ మహిళకు స్వల్ప గాయాలయ్యాయి. పోలీసులు రెండు వాహనాలను పోలీస్స్టేషన్కు తరలించి కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

వ్యక్తిపై దాడి

ఉరవకొండ, ఫిబ్రవరి 3(ఆంధ్రజ్యోతి): మండలంలోని వెలిగొండ గ్రామంలో చంద్రశేఖర్పై శివకుమార్, వినోద్ అనే వ్యక్తులు దాడిచేశారు. బైక్ను పార్క్ చేసే విషయంపై గొడవ జరగడంతో ఈ దాడి జరిగింది. గాయపడిన చంద్రశేఖర్ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

మాకొద్దు.. ఈ జూనియర్ లైన్మెన్

● కలెక్టర్కు మరుట్ల రైతుల ఫిర్యాదు

కూడేరు, ఫిబ్రవరి 3: (ఆంధ్రజ్యోతి): మండలంలోని మరుట్ల సబ్స్టేషన్ పరిధిలో పని చేస్తున్న జూనియర్ లైన్మెన్ లంచం ఇవ్వనిదే పని చేయరని, ఆయన మాకొద్దని మరుట్ల 1,2,3 కాలనీలకు చెందిన రైతులు కలెక్టర్ వినోద్కుమార్ వద్ద వద్ద మొర పెట్టుకున్నారు. జిల్లాకేంద్రంలోని కలెక్టరేట్లో సోమవారం జరిగిన గ్రీవెన్స్లో వారు కలెక్టర్ను కలిసి ఈ మేరకు ఫిర్యాదు చేశారు. తోటల్లో కరెంటు సమస్యలు వస్తే జూనియర్ లైన్మెన్ సాయినాథ్గౌడ్ స్పందించడం లేదని, లంచం ఇస్తే తప్ప పని చేయడని తెలిపారు. గతంలో పలు సార్లు అధికారుల దృష్టికి తెచ్చినా మార్పు రాలేదన్నారు. జూనియర్ లైన్మెన్ పై విచారణ చేసి చర్యలు తీసుకోవాలని రైతులు రవి, ఈశ్వరయ్య, బాలకృష్ణమూర్తి, చంద్రప్ప, తిమ్మనాయుడు, సోమప్ప తదితరులు కలెక్టర్ను కోరారు.

కందుల కొనుగోలు కేంద్రం ప్రారంభం

డీ.హీరేహాళ్, జనవరి 3(ఆంధ్రజ్యోతి): మండలంలోని గొడిశలపల్లి గ్రామంలో ప్రభుత్వం ఏర్పాటు చేసిన కందుల కొనుగోలు కేంద్రాన్ని టీడీపీ మండల కన్వీనర్ హనుమంతరెడ్డి సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఈ కేంద్రాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. నాయకులు శ్రీకాంత్రెడ్డి, బ్రహ్మానందరెడ్డి, ధనుంజయరెడ్డి, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

ముగ్గురిపై కేసు నమోదు

యాడికి, ఫిబ్రవరి 3(ఆంధ్రజ్యోతి): అప్పు విషయమై గొడవ పడ్డ సంఘటనలో కమలపాడు గ్రామానికి చెందిన గణేష్ అనే వ్యక్తి ఇచ్చిన ఫిర్యాదు మేరకు శివశంకర్, మునెప్ప, భాస్కర్లపై సోమవారం కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ వెంకటరమణయ్య తెలిపారు. కమలపాడుకు చెందిన గణేష్ ప్రొక్లెయినర్ ఆపరేటర్గా పనిచేస్తున్నాడు. ఏడాదిక్రితం అదే గ్రామానికి చెందిన శివశంకర్ వద్ద రూ.5వేలు అప్పు తీసుకున్నాడు. ఆ డబ్బులు చెల్లించాలని శివశంకర్, మునెప్ప, భాస్కర్ గణేష్ ఇంటివద్దకు వెళ్లి గొడవపడ్డారు. ఆ గొడవలో గణేష్కు గాయాలయ్యాయి. బాధితుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

కూలిడబ్బులు స్వాహా..

● ఫీల్డ్ అసిస్టెంట్పై ఏపీఓకు ఫిర్యాదు



ఏపీఓకు ఫిర్యాదు చేస్తున్న మహిళా కూలీ

శెట్టూరు, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చిన్నంపల్లి గ్రామానికి చెందిన లక్ష్మీ అనే మహిళా కూలీ గతేడాది ఏప్రిల్లో ఉపాధి హామీ పనులకు వెళ్లింది. అయితే ఆమెకు రావాల్సిన కూలిడబ్బులు రూ. 11,164 లను ఫీల్డ్ అసిస్టెంట్ అకౌంట్ మార్చి ఆయన బ్యాంకు ఖాతాకు జమ చేసుకున్నారు. తనకు రావాల్సిన కూలి డబ్బుల కోసం నెల రోజుల నుంచి ఉపాధి కార్యాలయం చుట్టూ ప్రదక్షిణ చేస్తున్నానని, ఎవరూ పట్టించుకోవడం లేదని ఆమె సోమవారం ఏపీవో నీరజకు ఫిర్యాదు చేశారు. తనకు కూలి ఇప్పించాలని కోరారు. రికవరీ చేస్తామని ఏపీవో తెలిపారు.

పురుగుల మందు తాగి వ్యక్తి ఆత్మహత్య

యాడికి, ఫిబ్రవరి 3(ఆంధ్రజ్యోతి): మండలంలోని నిట్టూరుకు చెందిన వెంకటరాముడు (58) ఆత్మహత్యకు పాల్పడ్డాడు. అతను ఏడాదిన్నర కాలంగా స్వగ్రామాన్ని విడిచి డోన్ సమీపంలోని ఒక గ్రామంలో నివాసం ఉంటున్నాడు. కాగా ఆదివారం నిట్టూరులోని తన ఇంటివద్దకు వెళ్లి అనంతరం యాడికికి వచ్చాడు. తర్వాత అదే రోజు రాత్రి యాడికి నుంచి పెద్దపేట గ్రామసమీపానికి వెళ్లి అక్కడ పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. సొంత గ్రామాన్ని విడిచి వెళ్లానని నిత్యం మదనపడుతుండేవాడని గ్రామస్థులు చెపిపనట్లు ఎస్ఐ వెంకటరమణ తెలిపారు. మృతుడి భార్య సుజాతమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు చెప్పారు.

లఘుచిత్రాలకు పురస్కారం

విడపనకల్లు, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పెద్ద కొట్టాల పల్లి గ్రామానికి చెందిన ఏఎస్ఆర్ షార్ట్ ఫిలిం వారికి అనంతపురం నగరంలోని ఫిలిం సొసైటీ వారు పురస్కారాన్ని అందించారు. ఈ సందర్భంగా షార్ట్ ఫిలిం నిర్మాత సుధాకర్, యాక్టర్ సుంకరాజు సోమవారం మాట్లాడుతూ కొద్ది రోజుల క్రితం ఏఎస్ఆర్ షార్ట్ ఫిలిం ఆధ్వర్యంలో వ్యవసాయకుడు, నగరంలో నరకయాతన, కొత్త సంవత్సరం.. కొత్త ప్రియురాలు అనే మూడు లఘు చిత్రాలను తీశామన్నారు. ఆ చిత్రాలకు ఉత్తమ పురస్కారాన్ని అనంతపురం లోని ఫి లిం సొసైటీ వారు ఆదివారం అందించారని తెలిపారు.



పురస్కారం అందుకుంటున్న షార్ట్ం ఫిలిం నిర్మాత సుధాకర్ తదితరులు

కూటమితోనే రైతుల సంక్షేమం

● కృతజ్ఞత సభలో ప్రభుత్వ విప్ కాలవ

బొమ్మనహాళ్, ఫిబ్రవరి 3(ఆంధ్రజ్యోతి): రైతుల ఆర్థిక పరిస్థితిని మెరుగుపరచడానికి కూటమి ప్రభుత్వం విశేష కృషి చేస్తోందని ప్రభుత్వ విప్ కాలవ శ్రీనివాసులు పేర్కొన్నారు. ఈ ఏడాది ఖరీఫ్లో ప్రభుత్వం బొమ్మనహాళ్, కణేకల్లు మండలాలలో వరిధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి అత్యధికంగా ధాన్యం సేకరించి నగదును సకాలంలో రైతుల ఖాతాల్లో జమ చేసింది. ఇందుకు విప్ కాలవశ్రీనివాసులు ఎంతగానో సహకరించారు. దీంతో బెళుగుప్ప, కణేకల్లు మండలాల రైతులు సోమవారం మండలంలోని శ్రీధరఘట్ట గ్రా మంలో కాలవకు కృతజ్ఞత సభ నిర్వహించారు. ఈ సందర్భంగా సభకు ఆయన్ను ప్రత్యేకంగా ఆహ్వానించి టీడీపీ మండల కన్వీనర్ బలరాంరెడ్డి ఆధ్వర్యంలో గజమాలతో ఘనంగా సత్కరించారు. అనంతరం కాలవ మాట్లాడుతూ.. రైతుల సంక్షే మం కోసం కూటమి ప్రభుత్వం అహర్నిశలు కృషి చేస్తోందన్నారు. రైతుల కష్టాన్ని గుర్తించి ధాన్యం లోడైన వెంటనే నగదును వారి ఖాతాల్లో జమ చేసిన ఘనత సీఎం చంద్రబాబుకే దక్కుతుందన్నారు. గత వైసీపీ ప్రభుత్వంలో ఖాళీసంచులు దొరకడమే కష్టంగా ఉండేదన్నారు. పలుకుబడి ఉంటేనే ధాన్యం సేకరించేవారన్నారు. కానీ ఇప్పుడు అలా కాకుండా ప్రతి రైతుకు చెందిన ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాల్లో కొనుగోలు చేస్తున్నారన్నారు. బొమ్మనహాళ్, కణేకల్లు మండలాలలో 13,800 మెట్రిక్ టన్నులు ధాన్యం సేకరించి రూ.32 కోట్లను రైతుల ఖాతాలో జమ చేసినట్లు చెప్పారు. ఒక్క బొమ్మనహాళ్ మండలంలోనే 7557 మంది రైతులతో 8449 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని సేకరించి రూ. 19.60 కోట్లు నగదు ను రైతుల ఖాతాల్లోకి జమ చేసినట్లు వివరించారు. ధాన్యం కొనుగోలులో ఎలాంటి ఇబ్బంది తలెత్తకుండా జాయిం ట్ కలెక్టర్, ఆర్డీఓ చేసిన కృషిని గుర్తు చేశారు. బహిరంగ మార్కెట్లో కన్నా ప్రభుత్వం ఎక్కువ ధర పెట్టి ధాన్యం కొనుగోలు చేసిందని అన్నారు. ఉంతకల్లు రిజర్వాయర్తో బొమ్మనహాళ్, కణేకల్లు, డీ.హీరేహాళ్ సస్యశ్యామలంగా ఉండేలా చర్యలు తీసుకుంటామని ఈ సందర్భంగా పేర్కొన్నారు. కార్యక్రమంలో కళ్యాణదుర్గం ఆర్డీఓ వసంతబా బు, తుంగభద్ర ప్రాజెక్ట్ వైస్ చైర్మన్ కేశవరెడ్డి, తహసీల్దార్ మునివేలు, ఈఓపీఆర్డీ దాస్, ఎంపీడీఓ విజయభాస్కర్, ఏఓ సాయికుమార్, టీడీపీ బొమ్మనహాళ్, కణేకల్లు, డీ.హీరేహాళ్ మండలాల కన్వీనర్లు బలరాంరెడ్డి, లాలెప్ప, హనుమంతరెడ్డి, సింగిల్ విండో మాజీ అధ్యక్షుడు కొత్తపల్లి మల్లికార్జున, మాజీ ఎంపీటీసీ సభ్యుడు కుమ్మరి మల్లికార్జున, మాజీ సర్పంచ్ ఆర్ గోవిందరెడ్డి, క్లస్టర్ కన్వీనర్ ధనుంజయ, నాయకులు ముల్లంగి నారాయణస్వామి, పయ్యావుల మోహన్, పయ్యావుల నాగరాజు, రైతు అధికార ప్రతినిధి ఎస్వీ నాగరాజు, మాజీ కన్వీనర్లు చలపతి, సుదర్శన్ తదితరులు పాల్గొన్నారు.



కాలవ శ్రీనివాసులును గజమాలతో సత్కరిస్తున్న రైతులు

విద్యార్థుల కోసం బస్సులు ప్రారంభం

బొమ్మనహాళ్: విద్యార్థుల కోసం జిందాల్ సాప్ కర్మాగారం యాజమాన్యం ఏర్పాటు చేసిన బస్సులను ప్రభుత్వవిప్ కాలవ శ్రీనివాసులు సోమవారం హరేసముద్రంలో ప్రారంభించారు. మండలంలో కురవళ్లి, చంద్రగిరి, సిద్ధరాంపురం, హరేసముద్రం గ్రామాల నుంచి మండలకేంద్రంలోని జిల్లా పరిషత్ పాఠశాలకు, జూనియర్ కళాశాలకు వెళ్లే విద్యార్థులకు బస్సు సౌకర్యం లేదు. దీంతో గ్రామస్థులు పలుమార్లు విద్యార్థులకు బస్సు సౌకర్యం కల్పించాలని జిందాల్ సాప్ కర్మాగారం యాజమాన్యానికి విన్నవించారు. ఇందుకు ఆ కర్మాగారం వారు రెండు బస్సులను అందుబాటులోకి తీసుకొచ్చారు. ఆ బస్సులను కాలవ శ్రీనివాసులు ప్రారంభించి మాట్లాడారు. గ్రామీణ ప్రాంతాల విద్యార్థుల కోసం బస్సు సౌకర్యం కల్పించడం హర్షణీయమని పేర్కొన్నారు.

శివాలయాల్లో ప్రత్యేక పూజలు



పామిడిలో ప్రత్యేక అలంకరణలో భోగేశ్వరుడు

పామిడి, ఫిబ్రవరి 3(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని భోగేశ్వరస్వామి ఆలయంలో సోమవారం ప్రత్యేక పూజలను ఘనంగా నిర్వహించారు. మాఘమాసం మొదటి సోమవారాన్ని పురస్కరించుకుని వేకువజామునే అర్చకులు మూలవిరాట్కు పలుఅభిషేకాలు చేసి ప్రత్యేకంగా అలంకరించారు. అనంతరం విశేష పూజలు చేపట్టారు. భక్తులు పెద్దఎత్తున తరలివచ్చి స్వామిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

గుంతకల్లుటౌన్: మండలంలోని నెలగొండ గ్రామంలో గల సోమనాథ ఆలయంలో స్వామి వారికి రుద్రాభిషేకం, పుష్పాలంకరణచేసి పూజలు నిర్వహించారు. భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చారు.

శెట్టూరు: మండల కేంద్రంలోని చెరువు కట్టసమీపంలో ఉన్న చంద్రమౌళీశ్వర స్వామి ఆలయంలో అర్చకులు వేకువజామునే స్వామి వారి మూలవిరాట్కు పలు అభిషేకాలు, అలంకరణలు చేసి ప్రత్యేక పూజలు జరిపారు. భక్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

ఘనంగా శివలింగం ప్రతిష్ఠ

యాడికి: మండలంలోని రామన్నగుడిసెలులో శివలింగం ప్రతిష్ఠను ఘనంగా నిర్వహించారు. నూతనంగా నిర్మించిన ఆలయాన్ని వేదపండితులు, గ్రామపెద్దలు ప్రారంభించి శివలింగాన్ని వేదమంత్రాల నడుమ శాస్త్రోక్తంగా ప్రతిష్ఠించారు. టీడీపీ నాయకుడు చవ్వా గోపాల్రెడ్డి గ్రామస్థులు పాల్గొన్నారు. ఇక వేములపాడు గ్రామంలో శివాలయం పునర్నిర్మాణ పనులు పూర్తయిన నేపథ్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు.

ఘనంగా వసంత పంచమి



తాడిపత్రిలో సరస్వతీదేవికి నమస్కరిస్తున్న జేసీపీఆర్

పామిడి, ఫిబ్రవరి 3(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని భోగేశ్వరస్వామి ఆలయం, సరస్వతీ విద్యామందిరంలో సోమవారం వసంత పంచమిని పురస్కరించుకుని చిన్నారులకు అక్షరాభ్యాసం చేశారు. భోగేశ్వరాలయంలో సరస్వతీ ఉత్సవ విగ్రహానికి అర్చకులు రామేశ్వరశర్మ వేదమంత్రోచ్ఛారణల నడుమ ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం అక్షరాభ్యాసం చేయించారు. కార్యక్రమంలో చిన్నారులతో పాటు వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

గుంతకల్లుటౌన్: పట్టణంలోని విశ్వవిజ్ఞాన్ స్కూల్లో వసంతపంచమిని పురస్కరించుకుని చిన్నారులకు సామూహిక అక్షరాభ్యాసం చేయించారు. బాసర నుంచి తెప్పించిన కుంకుమ ప్రసాదాన్ని విద్యార్థుల తల్లిదండ్రులకు పంపిణీ చేశారు. పాఠశాల కరస్పాండెంట్ విశ్వనాథ్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

బెళుగుప్ప: మండలకేంద్రంలోని సన్రైజర్ ఇంగ్లిష్ మీడియం ప్రైవేట్ పాఠశాలలో సామూహిక అక్షరాభ్యాసాన్ని నిర్వహించారు. తొలుత సరస్వతీ దేవికి తహసీల్దార్ షర్మిల, ఎంఈవో మల్లారెడ్డి, కరెస్పాండెంట్ మారెన్న పూజలు చేశారు. అనంతరం చిన్నారులతో అక్షరాభ్యాసం చేయించారు.

సరస్వతీదేవి విగ్రహ ప్రతిష్ఠ

తాడిపత్రి: పట్టణంలోని గాంధీకట్ట సమీపంలో ఉన్న సరస్వతీ విద్యామందిరంలో సరస్వతీదేవి విగ్రహ ప్రతిష్ఠ ఘనంగా జరిగింది. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మున్సిపల్ చైర్మన్ జేసీ ప్రభాకర్రెడ్డి హాజరై పూజలు చేశారు. అనంతరం మాట్లాడుతూ.. వసంత పంచమి సందర్భంగా సరస్వతిదేవి విగ్రహప్రతిష్ఠను చేయడం ఎంతో సంతోషంగా ఉందని తెలిపారు. టీడీపీ నాయకులు ఎస్వీ రవీంద్రారెడ్డి, సూర్యముని, కమిటీ సభ్యులు, పూర్వవిద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

విడపనకల్లు: మండల కేంద్రంలోని జెడ్పీహైస్కూల్లో సరస్వతీదేవి విగ్రహ ప్రతిష్ఠను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా తొలుత ఉపాధ్యాయులు, గ్రామ పెద్దలు, విద్యార్థులు సరస్వతీ దేవి విగ్రహాన్ని గ్రామ వీధుల్లో ఊరేగించారు. అనంతరం వేదపండితులు పాఠశాల ఆవరణలో ప్రతిష్ఠ చేసి ప్రత్యేక పూజలుచేశారు. హెచ్ఎం సురేష్బాబు, సర్పంచ్ చంద్రశేఖర్, పాఠశాల విద్యాకమిటి చైర్మన్ శ్రీనివాసులు, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

వైభవంగా భద్రావతి, భావనారుషీంద్రుల కల్యాణం



ఉత్సవమూర్తుల ఊరేగింపులో పాల్గొన్న భక్తులు

ఉరవకొండ, ఫిబ్రవరి 3(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని మార్కండేయస్వామి ఆలయంలో సోమవారం భద్రావతి, భావనారుషీంద్రుల కల్యాణోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా తొలుత ఆలయంలోని స్వామి మూలవిరాట్కు ప్రత్యేక అభిషేకాలు, అలంకరణలు, పూజలను చేశారు. తర్వాత ఉత్సవ మూర్తులను ప్రత్యేకవాహనంలో పట్టణ వీధుల గుండా ఊరేగించారు. తర్వాత ఆలయ ఆవరణలో ఆ ఉత్సవమూర్తులను ఉంచి వేదమంత్రాల నడుమ కల్యాణోత్సవాన్ని జరిపారు. భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. ఆలయ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన కన్యకాపరమేశ్వరి స్వర్ణోత్సవాలు



మహాకుంభాభిషేకం నిర్వహిస్తున్న వేదపండితులు, భక్తులు

బెళుగుప్ప, ఫిబ్రవరి 3(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని కన్యకాపరమేశ్వరి ఆలయంలో ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన స్వర్ణోత్సవాలు సోమవారం ఘనంగా ముగిశాయి. ఈ సందర్భంగా వేదపండితులు తొలుత ఆలయంలో అమ్మవారి మూలవిరాట్ను ప్రత్యేకంగా అలంకరించి, విశేష పూజలు చేశారు. అనంతరం ఆలయ ఆవరణలో నవగ్రహ హోమం, మహా పూర్ణాహుతి, మహాకుంభాభిషేకం, మహామంగళహారతి, తీర్థ ప్రసాద వినియోగం చేపట్టారు. దీంతో ఉత్సవాలు ముగిశాయి. తర్వాత ఆలయ అభివృద్ధికి కృషి చేసిన ఆర్యవైశ్య నాయకులకు సన్మానం జరిగింది.

అశ్వత్థం ఆలయ హుండీ ఆదాయం లెక్కింపు

పెద్దపప్పూరు, ఫిబ్రవరి 3(ఆంధ్రజ్యోతి): మండలంలోని అశ్వత్థ నారాయణస్వామి, చక్రస్థాపన భీమలింగేశ్వరస్వామి ఆలయంలో గత ఆదివారం మొదటి వారం తిరుణాల పూర్తవడంతో సోమవారం అధికారులు హుండీ కానుకల్ని లెక్కించారు. తాత్కాలిక హుండీల నుంచి రూ.4,91,526, శాశ్వత హుండీ నుంచి రూ.4,39,569, తలనీలాల నుంచి రూ.14,075, ప్రత్యేక దర్శనం నుంచి రూ.1,34,150, అభిషేకం టికెట్ల నుంచి రూ.300, విరాళాల నుంచి రూ.2300 వచ్చాయన్నారు. మొత్తం 10,81,921 రూపాయల ఆదాయం వచ్చినట్లు ఆలయ ఈఓ సుబ్రహ్మణ్యం తెలిపారు.

మెయిన్స్కు పది మంది విద్యార్థుల ఎంపిక

పుట్లూరు, ఫిబ్రవరి 3(ఆంధ్రజ్యోతి): మండలకేంద్రంలోని ఆదర్శపాఠశాలలో 10మంది విద్యార్థులు మెయిన్స్కు అర్హత సాధించినట్లు ప్రిన్సిపాల్ ఓబుల్రెడ్డి సోమవారం తెలిపారు. ప్రిలిమ్స్ పరీక్షను 2610మంది రాయగా మెయిన్స్కు ఆదర్శ పాఠశాల నుంచి 10మంది అర్హత సాధించారన్నారు. వీరికి ఈనెల 26న నీలారెడ్డిపల్లి వద్ద సత్యసాయి క్షేత్రంలో పరీక్ష నిర్వహించనున్నట్లు తెలిపారు.

ఏడో తేదీలోపు దరఖాస్తు చేసుకోండి

బెళుగుప్ప, ఫిబ్రవరి 3(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం కార్పొరేషన్ల నుంచి మంజూరు చేస్తున్న రుణాల కోసం అర్హులు దరఖాస్తు చేసుకోవాలని ఎంపీడీవో లక్ష్మీనారాయణ సోమవారం ప్రకటనలో తెలిపారు. బీసీ, ఈబీసీ, కమ్మ, రెడ్డి, ఆర్యవైశ్య, బ్రాహ్మణ, కాపు కార్పొరేషన్ల నుంచి రుణాల యూనిట్లు మంజూరయ్యాయన్నారు. ఈనెల 7వ తేదీలోపు ఆన్లైన్లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. బీసీలకు 34, ఈబీసీలకు రెండు, కమ్మకు ఒకటి, రెడ్డికి ఒకటి, కాపులకు ఆరు యూనిట్లు చొప్పున మంజూరయ్యాయని అన్నారు.

స్టడీ మెటీరియల్ పంపిణీ

గుంతకల్లు టౌన్, ఫిబ్రవరి 3(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని హనుమేష్ నగర్లో గల సాంఘిక సంక్షేమ బాలికల వసతి గృహంలో పదో తరగతి విద్యార్థినులకు జేవీవీ ఆధ్వర్యంలో మున్సిపల్ కమిషనర్ నయీమ్ అహ్మద్ స్టడి మెటీరియల్ పంపిణీ చేశారు. జేవీవీ రాష్ట్ర కార్యదర్శి హరిప్రసాద్యాదవ్, జిల్లా కార్యదర్శి నీలకంఠ వార్డెన్లు పాల్గొన్నారు.

ఘనంగా లక్ష్మీ వెంకటేశ్వరస్వామి రథోత్సవం

● పెద్దఎత్తున తరలివచ్చిన భక్త జనం

కుందుర్పి, ఫిబ్రవరి 3(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో సోమవారం లక్ష్మీ వెంకటేశ్వరస్వామి రథోత్సవం కన్నుల పండువగా సాగింది. ఈ సందర్భంగా అర్చకులు ఉదయమే ఆలయంలోని స్వామి, అమ్మవారి మూలవిరాట్లకు పలు అభిషేకాలు, అలంకరణలు చేసి ప్రత్యేక పూజలు జరిపారు. మధ్యాహ్నం ఉత్సవమూర్తులను ప్రత్యేకంగా అలంకరించి రథంలో కొలువుదీర్చి వేదమంత్రోచ్చారణలు, అశేష భక్తజనం నడుమ రథోత్సవాన్ని నిర్వహించారు. పుర వీధుల గుండా రథాన్ని లాగారు.



రథోత్సవంలో పాల్గొన్న అశేష భక్తజనం

రథోత్సవంలో పాల్గొన్న ఎమ్మెల్యే అమిలినేని..

లక్ష్మీ వెంకటేశ్వరస్వామి బ్రహ్మరథోత్సవాని ఎమ్మెల్యే అమిలినేని సరేంద్రబాబు ముఖ్యఅతిథిగా వచ్చారు. ఆలయ అర్చకులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. అనంతరం ఆయన స్వామిని దర్శించుకుని, భక్తులతో కలిసి రథాన్ని లాగారు. వేడుకల్లో తహసీల్దార్ శ్రీనివాసులు, ఎంపీడీవో లక్ష్మీనరసింహ, డీటీ తిప్పేస్వామి, ఆర్ఐ పోతిరెడ్డి, టీడీపీ శ్రేణులు పాల్గొన్నారు.

నూతన తేరు పరిశీలన

కుందుర్పి మండలం అపిలేపల్లికి బొబ్బర్లకుంట ఆంజనేయస్వామి నూతన రథం చేరుకోవడంతో గ్రామస్థుల ఆహ్వానం మేరకు ఎమ్మెల్యే అమిలినేని సరేంద్రబాబు గ్రామానికి వెళ్లి తేరును పరిశీలించారు. తేరును అందంగా తీర్చిదిద్దిన గదగ్ అచార్యులను సన్మానించారు. ఎమ్మెల్యే సహకారంతోనే స్వామి వారి తేరును తయారు చేయించామని గ్రామస్థులు తెలిపారు.



ప్రత్యేకాలంకరణలో లక్ష్మీవెంకటేశ్వర స్వామి

సీసీ రోడ్ల ప్రారంభం



సీసీ రోడ్డును ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే అమిలినేని

కుందుర్పి, ఫిబ్రవరి 3(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో పలు కాలనీల్లో ఉపాధి హామీ కింద నిర్మించిన సీసీ రోడ్లను ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు సోమవారం ముఖ్యఅతిథిగా హాజరై ఉపాధి సిబ్బం ది, టీడీపీ నాయకులతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా మా ట్లాడుతూ.. కుందుర్పి మండల కేంద్రంలోని కాలనీల్లో ఉపాధి పథకం కింద 18 పనులకు ఏకంగా రూ. 2.07 కోట్లను ఖర్చు చేసినట్లు వివరించారు. గత వైసీపీ ప్రభుత్వం ఐదేళ్లలో ఒక్క సీసీ రోడ్డు కూడా వేయలేకపోయిందన్నారు. కూటమి ప్రభుత్వం వచ్చాక ఎనిమిది నెలల్లోనే దాదాపు అన్ని గ్రామాల్లోనూ సీసీ రోడ్లు వేసిందని చెప్పారు. మిగిలిన గ్రామాల్లో కూడా త్వరలోనే రోడ్లు వేస్తామన్నారు. టీడీపీ మండల కన్వీనర్ ధనుంజయ, నాయకులు మల్లికార్జున, బసప్ప, రామమూర్తి, గ్రామ కన్వీనర్ రంగనాథ్, తాహిర్, రాఘవేంద్ర బాబు, చిత్రలింగ తదితరులు పాల్గొన్నారు.

చిలమకూరు వద్ద సబ్స్టేషన్ ప్రారంభం

● ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ



ప్రారంభోత్సవంలో పాల్గొన్న ఎమ్మెల్యే, అధికారులు, నాయకులు

యల్లనూరు, ఫిబ్రవరి 3(ఆంధ్రజ్యోతి): మండలంలోని చిలమకూరు వద్ద ఏర్పాటు చేసిన విద్యుత్ సబ్స్టేషన్ను ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ సోమవారం ముఖ్యఅతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. గత వైసీపీ ప్రభుత్వంలో సబ్స్టేషన్ నిర్మాణ పనులు సక్రమంగా జరగలేదన్నారు. కూటమి ప్రభుత్వం రాగానే త్వరితగతిన పనులు పూర్తిచేయించామని అన్నారు. చిలమకూరు, అచ్యుతాపురం, కోడిమూర్తి, తిరుమలాపురం గ్రామాలు ఇప్పటివరకు యల్లనూరు సబ్స్టేషన్ కింద ఉన్నాయని, ఇక ఇప్పటి నుంచి చిలమకూరు సబ్స్టేషన్ పరిధిలోకి వస్తాయని తెలిపారు. ఇక నుంచి రైతులకు లోవోల్టేజీ సమస్య ఉండదని చెప్పారు. కార్యక్రమంలో గుత్తి ఈఈ రాజశేఖర్, ఈఈ కన్స్ట్రక్షన్ మోహనమ్మ, ఈఈటీఆర్ఈ రవిశంకర్, ఏడీ రంగస్వామి, ఏఈ పద్మనాభరెడ్డి, టీడీపీ నాయకులు జనార్దన్రెడ్డి, శ్రీనివాసులరెడ్డి, మోహన్నాయుడు, రత్నమయ్య, మండల కన్వీనర్ రామాంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

ఉర్దూ ప్రాథమికోన్నత పాఠశాల విలీనం వద్దు

● ఎంఈఓతో విద్యార్థుల తల్లిదండ్రులు

యాడికి, ఫిబ్రవరి 3(ఆంధ్రజ్యోతి): మండలకేంద్రంలోని ఉర్దూ ప్రాథమికోన్నత పాఠశాలలో 6, 7, 8 తరగతులను హైస్కూల్లో విలీనం చేసే ప్రక్రియను నిలిపివేయాలని కోరుతూ సోమవారం విద్యార్థుల తల్లిదండ్రులు ఎంఈఓ కాశప్పకు విన్నవించారు. ఉర్దూ ప్రాథమికోన్నత పాఠశాలలో 6, 7, 8 తరగతులకు సంబంధించి కేవలం 13మంది విద్యార్థులు మాత్రమే ఉన్నారు. విద్యార్థుల సంఖ్య తక్కువగా ఉన్న కారణంగా ఆయా తరగతులను యాడికి హైస్కూల్లో విలీనం చేసే దిశగా ప్రయత్నాలు జరుగుతున్నాయి. ఈ నేపథ్యంలో ఉర్దూ పాఠశాలలో ఎంఈఓ విద్యార్థుల తల్లిదండ్రులతో సమావేశం నిర్వహించి మాట్లాడారు. 6, 7, 8వ తరగతుల్లో విద్యార్థుల సంఖ్య తక్కువగా ఉన్నందున విలీనం చేయాల్సి వస్తోందని తెలిపారు. దీనికి విద్యార్థుల తల్లిదండ్రులు ససేమిరా అన్నారు. కిలోమీటర్కు పైగా దూరం ఉన్న హైస్కూల్కు విద్యార్థులను పంపాలంటే తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటారని తెలిపారు. ఎట్టి పరిస్థితుల్లోను తమ పిల్లలను హైస్కూల్కు పంపిచేది లేదని అన్నారు. విద్యార్థుల తల్లిదండ్రులకు మద్దతుగా పలువురు ముస్లింలు కదిలివచ్చారు. పాఠశాలలో విద్యార్థుల సంఖ్యను పెంచడానికి తామంతా కృషి చేస్తామని, ఉర్దూ ప్రాథమికోన్నత పాఠశాలను విలీనం చేయడానికి వీలులేదని తేల్చిచెప్పారు. విద్యార్థుల తల్లిదండ్రుల విన్నపాన్ని ఉన్నతాధికారులకు తెలియజేస్తానని ఎంఈఓ తెలిపారు.

మున్సిపల్ ఇంజనీరింగ్ కార్మికుల నిరసన

తాడిపత్రి, ఫిబ్రవరి 3(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని వాటర్ సప్లై మస్టర్ పాయింట్ వద్ద మున్సిపల్ ఇంజనీరింగ్ కార్మికులు సోమవారం నల్లబ్యాడ్జీలతో నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా కమిటీ సభ్యుడు జగన్మోహన్రెడ్డి మాట్లాడుతూ 20 ఏళ్లుగా కొనసాగుతున్న విధుల్లోని కార్మికులను మున్సిపల్ కమిషనర్ వేరే విధుల్లోకి మారుస్తూ ఇబ్బందులకు గురిచేస్తున్నారన్నారు. కార్మికులకు సంఘం ఉండకూడదని ఇలాంటి పనులు చేస్తున్నారని ఆరోపించారు. కేవలం ఇద్దరి కార్మికులపైనే కక్షపూరితంగా వ్యవహరిస్తున్నారని దుయ్యబట్టారు. ఇప్పటికైనా ఎవరిపనుల్లో వారినే కొనసాగేలా చూడాలని తెలిపారు. సీఐటీయూ నాయకుడు ఉమాగౌడ్, పలువురు ఇంజనీరింగ్ కార్మికులు పాల్గొన్నారు.

విద్యుత్ వైర్లు తగిలి పశుగ్రాసం దగ్ధం

బొమ్మనహాళ్, ఫిబ్రవరి 3(ఆంధ్రజ్యోతి): మండలంలో దర్గాహొన్నూరు గ్రామ శివారులో అగ్నిప్రమాదం చోటుచేసుకుని ట్రాక్టర్తో పాటు పశుగ్రాసం కాలిపోయాయి. గ్రామానికి చెందిన సంతోష్ పొలంలో ఉన్న జొన్నసొప్పను ట్రాక్టర్లో తీసుకొస్తుండగా కిందకు వేళాడుతున్న కరెంటు వైర్లు తగిలి మంటలు చెలరేగాయి. దీంతో పశుగ్రాసంతో పాటు ట్రాక్టర్ ట్రాలీ దగ్ధమైంది. ప్రమాదంలో రూ. 3 లక్షలు నష్టం వాటిల్లిందని బాధితరైతు వాపోయాడు.

స్టాక్ పాయింట్ తనిఖీ

కణేకల్లు, ఫిబ్రవరి 3(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో గల రేషన్ స్టాక్ పాయింట్ను కళ్యాణదుర్గం ఆర్డీఓ వసంతబాబు సోమవారం తనిఖీ చేశారు. కణేకల్లు, బొమ్మనహాళ్ మండలాలలో గల రేషన్ దుకాణాలకు బియ్యంతో పాటు ఇతర సరుకులను అందజేసే స్టాక్పాయింట్ను తనిఖీ చేసి రికార్డులను పరిశీలించారు. కార్యక్రమంలో తహశీల్దార్ ఫణికుమార్, స్టాకిస్ట్ సుధాకర్ పాల్గొన్నారు.

నీటి సమస్య తీర్చాలని వినతి

కణేకల్లు, ఫిబ్రవరి 3(ఆంధ్రజ్యోతి): మండలంలోని బ్రహ్మసముద్రం గ్రామంలో నెలకొన్న తాగునీటి సమస్యను తీర్చాలని ప్రభుత్వ విప్ కాలవ శ్రీనివాసులుకు గ్రామస్థులు వినతిపత్రం అందించారు. ఆ గ్రామానికి చెందిన టీడీపీ నాయకులు రామప్ప, రామాంజనేయులుతో పాటు గ్రామస్థులు సోమవారం రాయదుర్గంలో కాలవను కలిసి సమస్యను వివరించి వినతిని అందజేశారు.

వైన్షాపులో కర్ణాటక మద్యం?

●బిహార్ కూలీలకు తెప్పించినట్లు సోషల్ మీడియాలో వైరల్

పుట్లూరు, ఫిబ్రవరి 3(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఓ వైన్షాపులో కర్ణాటక మద్యం విక్రయిస్తున్నట్లు సమాచారం. ఈ వ్యవహారం సోషల్మీడియాలో వైరల్ అయింది. ఆ వైన్షాపు వద్ద ఎక్కువగా ఇతర రాష్ట్రాలకు చెందిన అరటిపంట కోసే కూలీలు ఉండడంతో గిట్టుబాటు అవుతున్నట్లు తెలిసింది. బీహార్, ఉత్తరప్రదేశ్, రాజస్థాన్కు చెందిన కూలీలు ఎక్కువగా టెట్రా ప్యాకెట్లు మందు తాగు తుండడంతో తెప్పించినట్లు సమాచారం. కాగా ఈ విషయంపై తాడిపత్రి ఎక్సైజ్ సీఐని వివరణ కోరగా అలాంటిదేమి తన దృష్టికి రాలేదని, వస్తే చర్యలు తీసుకుంటామని తెలిపారు.

మోడల్ పరీక్ష పోస్టర్ల విడుదల

రాయదుర్గం రూరల్, ఫిబ్రవరి 3(ఆంధ్రజ్యోతి): ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో ఈ నెల 9వ తేదీన రాష్ట్రవ్యాప్తంగా టెన్త్ విద్యార్థులకు నిర్వహించే మోడల్ పరీక్షలకు సంబంధించిన పోస్టర్లను పట్టణంలోని పోలీస్స్టేషన్లో సోమవారం అర్బన్ సీఐ జయనాయక్, ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కమిటీ సభ్యులు బంగి శివ ఆవిష్కరించారు. 10వ తరగతి విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఎస్ఎఫ్ఐ నాయకులు పాల్గొన్నారు.